అనకాపల్లిలో క్వారీల నిర్వహణపై విజి'లెన్స్'

- గనుల శాఖ అధికారులతో కలిసి పరిశీలన
- గత ఐదేళ్లలో జరిగిన తవ్వకాలపై ఆరా!

అనకాపల్లి మండలంలోని అక్రమ క్వారీలు, తవ్వకాలు, క్రషర్ల నిర్వహణపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం, గనుల శాఖ విజిలెన్స్ విభాగం ప్రత్యేక దృష్టి సారించాయి.

- 8లో

ఉక్కు సంకల్పం!

ప్రగతి, ఉపాధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు

- నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఉక్కు కర్మాగారానికి లైన్ క్లియర్
- రెండు దశల్లో నిర్మాణం
- రూ.1,47,596 కోట్ల పెట్టుబడి
- తొలిదశ పనులకు 2,200 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు
- రెండో దశకు 3,800 ఎకరాలు సేకరణ
- 316 ఎకరాల్లో పోర్టు నిర్మాణం
- హైవే నుంచి కర్మాగారం వరకు నాలుగు వరుసల రహదారి



నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ కర్మాగారానికి కేటాయించనున్న ఏపీఐఐసీ సేకరించిన భూమి ఇదే

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానంతో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుల ఆకర్షణ కోసం శరవేగంగా అడుగులు వేస్తున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం అనకాపల్లి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి మండలంలో గతంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు కృషి జరుగుతోంది. నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, డీఎల్ పురం, వేంపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ ఉమ్మడి ఆధ్వర్యంలో 17.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కానున్నది. తొలిదశ ప్రాజెక్టుకు అవసరమైన 2,200 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టౌన్‌షిప్ ఏర్పాటు కోసం వేంపాడు, నెల్లిపూడి, ఉద్దండపురం గ్రామాల్లో మరో 440 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రెండు దశల్లో ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారానికి మొత్తం రూ.1,47,596 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. మొదటి దశలో రూ.80 వేల కోట్ల పెట్టుబడితో ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్నారు.

రెండో దశకు 3,800 ఎకరాలు సేకరణ

ఉక్కు కర్మాగారం రెండో దశ నిర్మాణ పనుల కోసం 3,800 ఎకరాలను సేకరించాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. రెండో దశలో సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడితో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 10.5 మిలియన్ టన్నులకు పెంచనున్నారు. తొలిదశ పనులను 2029 జనవరి నాటికి, రెండో దశ నిర్మాణ పనులను 2033 నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించింది.

రవాణా వ్యవస్థ అభివృద్ధి...

నక్కపల్లి ప్రాంతంలో భారీ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కానుండడంతో జల, రోడ్డు రవాణా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నది. ఉక్కు కర్మాగారానికి ముడిసరకు దిగుమతి, తయారైన ఉత్పత్తుల ఎగుమతి కోసం 316 ఎకరాల్లో శాటిలైట్ పోర్టును నిర్మించనున్నారు. తొలిదశలో రెండు బెర్తులు, రెండో దశలో నాలుగు బెర్తులను నిర్మించాలని నిర్ణయించారు. ఇక జాతీయ రహదారి నుంచి ఐదారు కిలో మీటర్ల దూరంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కానున్నది. జాతీయ రహదారి నుంచి ఉక్కు ఫ్యాక్టరీ వరకు నాలుగు వరుసల రహదారిని నిర్మిస్తారు.

ప్రాణాలు తీస్తున్న ఫార్మా కంపెనీలు

వరుసగా ప్రమాదాలు

నిర్లక్ష్యం వీడని యాజమాన్యాలు

- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- నష్టపరిహారం పంపిణీతోనే సరి...చర్యలు శూన్యం
- కమిటీల నియామకంతో కాలక్షేపం
- ఐదేళ్లలో 43 ప్రమాదాలు...91 మంది మృతి
- 17 మందిని బలిగొన్న ఎసెన్షియా ప్రమాదం
- మూడు నెలలవుతున్నా ఇప్పటికీ అందని నివేదిక
- తాజాగా ఠాగూర్ ఫార్మాలో ఇద్దరి మృతి
- ఆ అధికారులు తనిఖీ చేస్తున్న కంపెనీల్లోనే ప్రమాదాలు



ఎసెన్షియా ఫార్మాలో ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా కంపెనీలలో ప్రమాదాలకు అంతులేకుండా పోతోంది. భారీ ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోతున్నా అధికారులు కఠిన చర్యలు చేపట్టడం లేదు. చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేస్తే సమస్య పరిష్కారం అయిపోయినట్టుగా భావిస్తున్నట్టు న్నారు. అందుకే యాజమాన్యాల నిర్లక్ష్యానికి చెక్ పెట్టలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని రాంకీ ఫార్మాసిటీలో 100, అచ్యుతాపురం సెజ్‌లో 210 పరిశ్రమలు ఉన్నాయి. ఇవికాకుండా నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉంది. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో మూడు నెలల క్రితం భారీపేలుడు సంభవించి 17 మంది చనిపోయారు. దీనిపై అన్ని శాఖల అధికారులు హడావుడి చేశారు. కూటమి నేతలు పరామర్శలకు క్యూకట్టారు. ప్రమాదం ఎలా జరిగిందో తేల్చడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. మూడు నెలలు అవుతోంది. ఇప్పటివరకూ నివేదిక ఇవ్వలేదు. అంత భారీ ప్రమాదాన్ని కూడా అధికారులు తేలిగ్గా తీసుకోవడం, యాజమాన్యంపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల మిగిలిన సంస్థలు కనీస జాగ్రత్తలు కూడా ... మిగతా 8వ పేజీలో

ఈ ఐదేళ్లలో ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు	మరణాలు
2019-20	13	17
2020-21	9	31
2021-22	11	12
2022-23	6	11
2023-24	4	20
మొత్తం	43	91

ఉన్నతాధికారుల సూచనలు

- ప్రతి కంపెనీ నైపుణ్యం కలిగిన కార్మికులను నియమించుకోవాలి.
- 3 నెలలకు ఓసారి మాక్ డ్రిల్ నిర్వహించాలి.
- స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాలు పాటించాలి.
- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.
- ప్రమాదం జరిగిన వెంటనే అలారం మోగేలా వ్యవస్థ (బజరింగ్) పెట్టుకోవాలి.
- అక్కడ జరిగే ఉత్పత్తి ప్రక్రియ, రసాయనాలపై ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన కల్పించాలి.

ఇవీ లోపాలు

- కంపెనీ సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని, ఇంకెవరూ తనిఖీ చేయాల్సిన అవసరం లేదని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి.
- అన్ని తనిఖీలు పూర్తయ్యాకే కంపెనీలకు ఎన్‌ఓసీ ఇవ్వాలి.
- సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి.

ఠాగూర్ ఫార్మా ప్రమాదంలో మరొకరి మృతి

- రెండుకు చేరిన మృతుల సంఖ్య



మృతిచెందిన వీరశేఖర్

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్‌లో మంగళవారం సాయంత్రం విష వాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సీహెచ్ వీరశేఖర్ (36) అనే ఉద్యోగి గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. వీరశేఖర్ రెండేళ్లుగా పరిశ్రమలో వేర్‌హౌస్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం గుంతనవానిపాలేనికి చెందిన వీరశేఖర్‌కు భార్య సూర్యకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అగనంపూడి సమీపంలో గల ఫార్మా పునరావాస కాలనీలో నివాసం ఉండేవారు. కాగా విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కాగా ఇదే ప్రమాదంలో బుధవారం మృతిచెందిన అమిత్‌భాగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఠాగూర్ ఫార్మాలో మరో 18 మందికి అస్వస్థత

- విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఠాగూర్ ఫార్మా పరిశ్రమలో విష వాయువుల లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన మరో 18 మంది ఉద్యోగులు గురువారం విశాఖ నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరారు. వీరికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్టు సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం జరిగిన విషవాయువుల లీకేజీ ఘటనలో తొలుత 11 మంది ఉద్యోగులు అస్వస్థతకు గురికాగా ఆస్పత్రుల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఒకరు, గురువారం మరొకరు మృతిచెందారు. ఆ తొమ్మిది మందితోపాటు గురువారం చేరిన మరో 18 మంది కలిపి మొత్తం 27 మంది చికిత్స పొందుతున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు.

నేడు పరిశ్రమల శాఖ మంత్రి సుభాశ్ రాక

అనకాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు పరవాడ చేరుకుంటారు. విషవాయువు లీకైన పరవాడ ఫార్మా సిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్‌ను సందర్శిస్తారు. ప్రమాదానికిగల కారణాలను అధికారులు, ఫార్మా కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం గాజువాక ప్రాంతంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తారు.

రైల్వే ఫ్లై ఓవర్ వంతెనలు ఛిద్రం

ప్రమాదకరంగా మారిన ప్రయాణం

- కొత్తూరు బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు
- ఐదేళ్ల నుంచి కొరవడిన నిర్వహణ పనులు
- అధ్వానంగా లంకెపాలెం వంతెన
- గోతులు ఏర్పడి బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు
- ఫుట్‌పాత్, డివైడర్, రెయిలింగ్ పలుచోట్ల ధ్వంసం



పెచ్చు లేచిపోయి గోతులు ఏర్పడిన కొత్తూరు వంతెన



లంకెలపాలెం వంతెన డివైడర్‌పై విరిగిపోయిన పలకలు

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ వంతెనపై నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఒకవైపు రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతిని పాడైపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గోతులబారి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వంతెన మీదుగా అనకాపల్లి, కశింకోట, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ వంతెనపై మొక్కుబడిగా మరమ్మతులుచేసి చేతులు దులుపుకోవడంతో కొద్ది రోజులకే గోతులు ప్రత్యక్షం అవుతున్నాయి. వంతెన పాడవడానికి భారీ గ్రానైట్ బ్లాకులు, క్వారీ రాళ్లు, గ్రావెల్ రవాణా చేసే వాహనాలు రాకపోకలు సాగించడమే కారణమని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కుంచంగి, వేటజంగాలపాలెం, రొంగలివానిపాలెం గ్రామాల పరిధిలోని క్వారీల నుంచి పెద్ద పెద్ద బండరాళ్లను భారీ వాహనాలతో ఈ రోడ్డు మీదుగా రవాణా చేస్తుంటారు. వంతెన సామర్థ్యానికి మించిన బరువుతో భారీ వాహనాలు వెళుతుండడంతో వంతెన దెబ్బతింటున్నదని అభిప్రాయ పడుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేని ఆరోపిస్తున్నారు.



కొత్తూరు వంతెనపై ఒకవైపు పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

లంకెలపాలెం ఫ్లై ఓవర్...

లంకెలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం హైవే జంక్షన్ నుంచి ఫార్మాసిటీకి వెళ్లే రహదారిలో వున్న రైల్వే ఫ్లై ఓవర్ వంతెన అధ్వానంగా ఉంది. నిత్యం పరవాడ ఫార్మా సిటీ, ఎన్‌టీపీసీ, బార్క్, అచ్యుతాపురం ఎస్‌ఈజడ్, తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఏళ్ల తరబడి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డుతో పాటు డివైడర్, ఫుట్‌పాత్ పలుచోట్ల ఛిద్రం అయ్యాయి. రహదారిపై శ్లాబ్ లేచిపోవడంతో ... మిగతా 8వ పేజీలో



లంకెలపాలెం వంతెనపై తారు లేయర్ లేచిపోవడంతో గోతులు ఏర్పడి బయటకు కనిపిస్తున్న ఇసుక ఊచలు

చివరి దశలో తెగుళ్ల దాడి

నిన్న మొన్నటి వరకు రెల్లరాల్చు పురుగు, సుడిదోమ..

- తాజాగా మానిపండు తెగులు
- నల్లగా మాడిపోతున్న వరి కంకులు
- ఈ దశలో మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదంటున్న అధికారులు
- ధాన్యం దిగుబడి 5-15 శాతం వరకు తగ్గే అవకాశం



మాని పండు తెగులు ఆశించడంతో నల్లగా మారిన వరి కంకులు

రావికమతం నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా వరి పంట చేతికి వచ్చే సమయంలో తెగుళ్లు, కీటకాలు దాడి చేసి అన్నదాతలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇటీవల వరకు రెల్ల రాల్చు పురుగు (కత్తెర పురుగు), సుడి దోమ ఆశించగా, తాజాగా 'మాని పండు' తెగులు విజృంభిస్తున్నది. మరో పది, పదిహేను రోజుల్లో వరి పైరు కోతకు వస్తుందని, ఈ తరుణంలో తెగుళ్లు సోకి పంటకు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల, కీటకాల కారణంగా ధాన్యం దిగుబడి తగ్గిపోవడమే కాకుండా నాణ్యత లోపిస్తుందని ఆందోళన చెందుతున్నారు. మానిపండు తెగులు ఆశించిన పొలాల్లో వరి కంకులు తొలుత ఆకుపచ్చగా, తరువాత పసుపు రంగుగా మారి అనంతరం నల్లటి బొగ్గుల్లా అవుతున్నాయని రైతులు తెలిపారు. ఆర్‌జీఎల్ రకం వరినే ఎక్కువగా తెగుళ్లు ఆశిస్తున్నాయని, అక్కడక్కడ సాంబమసూరికి కూడా సోకాయని రైతులు వాపోతున్నారు. ఒకపక్క తెగుళ్ల బెడద, మరోపక్క తుఫాన్ హెచ్చరికలు తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కాగా మానిపండు తెగులు లక్షణాలు, నివారణ చర్యల గురించి మండల వ్యవసాయాధికారిణి డి.రూపను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ఈ తెగులు సోకిన తరువాత మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండదన్నారు. పొట్ట, కంకి దశల్లోనే మందులను పిచికారీ చేస్తే మానిపండు తెగులు ఆశించదని చెప్పారు. మానిపండు తెగులు ఆశించిన పొలాల్లో ధాన్యం దిగుబడి ఐదు నుంచి 15 శాతం వరకు తగ్గే అవకాశం వుందని ఆమె చెప్పారు. పొలంలో మానిపండు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే తెగులు ఆశించిన కంకులను ఏరి, దూరంగా తీసుకెళ్లి కాల్చివేయాలని, లేదంటే గాలి ద్వారా పొలం మొత్తం వ్యాపించే ప్రమాదం వుందని ఆమె తెలిపారు. వరి పొట్ట, కంకి దశల్లో కార్బండిజమ్ మందును లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున, లేదా ప్రాపికోనజల్ మందు లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేసుకుంటే మానిపండు తెగులు ఆశించదని ఆమె సూచించారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈల సర్వే

- జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు) సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో ఎంఎస్‌ఎంఈలను గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 29వ తేదీన ప్రారంభించి 2025 ఫిబ్రవరి ఒకటో తేదీనాటికి సర్వే పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించినట్టు పేర్కొన్నారు. పట్టణాలు, మండలాల్లో ఎంఎస్‌ఎంఈల సర్వేకు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, జిల్లా స్థాయిలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. సర్వే కోసం ప్రభుత్వం ఒక యాప్‌ను రూపొందించిందని, దీని ద్వారా వివరాలు సేకరించేందుకు వార్డు/ గ్రామ సచివాలయాల నుంచి ఆరుగురు సిబ్బందిని తీసుకోవాలని కమిషనర్లకు, ఎంపీడీఓలకు సూచించినట్టు తెలిపారు.

నక్కపల్లి ఉక్కుకు ఏలేరు నీరు

- యండపల్లి వద్ద కాలువను పరిశీలించిన ఏపీఐఐసీ అధికారులు
- ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ కాలువ...



యండపల్లి వద్ద ఏలేరు కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ప్రైవేటు రంగంలో ఏర్పాటు కానున్న స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన నీటిని ఏలేరు కాలువ నుంచి సరఫరా చేసేందుకు గురువారం అధికారుల బృందం కోటవురట్ల మండలంలో పర్యటించింది. ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యం విజయవాడ నుంచి వచ్చిన అధికారులు యండపల్లి వద్ద ఏలేరు కాలువను పరిశీలించారు. ఇక్కడి నుంచి పైపులైన్ల ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు నీటిని తరలించే అంశంపై చర్చించారు. ఇక్కడి నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వద్ద స్టోరేజీ ట్యాంకు వద్దకు దూరం ఎంత? పైపులైన్ల ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుంది? అన్నది అంచనా వేస్తామన్నారు. ఒకవేళ ఏలేరు కాలువ నుంచి సాధ్యం కాకపోతే దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని తరలించవచ్చన్న ఉద్దేశంతో అధికారులు పోలవరం కాలువను కూడా సందర్శించారు.

నేడు నక్కపల్లిలో ప్రజా దర్బార్

- హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో నిర్వహణ

నక్కపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం నక్కపల్లిలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ఇందుకోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. అన్ని శాఖల జిల్లా అధికారులతోపాటు నియోజకవర్గం పరిధిలోని ఆయా శాఖ డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరవుతారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు, వినతిపత్రాలు ఇచ్చేందుకు ఈ ప్రజాదర్బార్‌ను ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి కార్యాలయ అధికారులు ఒక ప్రకట నలతో కోరారు. కాగా ప్రజాదర్బార్ వేదిక, ప్రాంగణం ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఎంపీడీవో డి.సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, మంత్రి కార్యాలయం అధికారులు పరిశీలించారు.

ఆవు పాల ధరను పెంచాలి : సీఐటీయూ



భోగాపురం పాలసేకరణ కేంద్రం వద్ద మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం భోగాపురం, జంగులూరు పాలసేకరణ కేంద్రాల వద్ద ఆయన పాడి రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులు భారీ స్థాయిలో ఉద్యమిస్తున్నప్పటికీ డెయిరీ యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దాణా ధరలతోపాటు డెయిరీ నుంచి విడుదలైన పాడి ఉత్పత్తుల ధరలను పెంచి పాల సేకరణ ధరను తగ్గించడం బాధాకరమన్నారు. డిసెంబరు రెండున విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని రైతులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, రామునాయుడు, సత్యం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

- నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి



ఎరువులను పరిశీలిస్తున్న నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి

రాంబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి, మురకాడ, కట్టుబోలు గ్రామాలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలను గురువారం నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు టి. శ్రీదేవి పరిశీలించారు. ఆయా షాపుల్లో రికార్డులు, లైసెన్సులు, బిల్ బుక్కులు, ఎరువుల స్టాక్‌లను పరిశీలించారు. ఎంఆర్‌పీకే ఎరువులు, పురుగుల మందులను రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిచినట్టయితే చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్‌ల వివరాలను బ్లాక్‌బోర్డుపై రాయాలని సూచించారు. తుఫాన్ కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. రబీలో పంటలు సాగు చేసే రైతులందరూ రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట బీమా చేయించుకోవాలని ఏవో సిసుమంత తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు



కూటమి సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డి శ్రీను

మునగపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టి సారించారని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కూటమి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నిర్మాణాత్మకంగా ఏ అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలకు మహర్దశ పట్టిందన్నారు. జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం మాట్లాడుతూ అభివృద్ధి అనే పదానికి కూటమి ప్రభుత్వం నిలువటద్దంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బద్దెం సూర్యనారాయణ, ఏవీ.సత్యనారాయణ, కొరపాటి వీరరాజశేఖర్, కాండ్రేగుల నాయుడు, కాళ్ల చంద్రమోహన్, కాండ్రేగుల నాగేంద్ర, పొలమరశెట్టి మురళి, శరగడం యోగి నాగేశ్వరరావు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ విజ్ఞాన సదస్సుకు విశేష స్పందన



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రసాదరావు

మునగపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఔషధ విజ్ఞాన సదస్సుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వైద్యులు వచ్చారని మునగపాక గురూజీ మూలికా వైద్య సమాఖ్య ప్రతినిధి అలుగోలు ప్రసాదరావు తెలిపారు. స్థానిక రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో తిరుపతి పారంపర్య వైద్య మహా సంఘం, మునగపాక గురూజీ మూలికా వైద్య సమాఖ్య సంయుక్త నిర్వహణలో గురువారం ఔషధవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి 250 మంది వైద్యులు వచ్చారన్నారు. ఈ వృత్తిలోకి కొత్తగా వచ్చే వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలు రకాల మూలికలను, దుంపలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో విజయానంద స్వామిజీ, వి.బాలకృష్ణ, ఎ.రాజు, సుధారాణి, మహర్షి, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను ప్రజలు వినియోగించుకోవాలి

ఎస్.రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో శుక్రవారం ఉదయం జరగనున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్‌లో ఇస్తే వాటి పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు.

కోటవురట్లలో..

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఈనెల 29వ తేదీన నక్కపల్లిలో నిర్వహించే ప్రజాదర్బార్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. గురువారం జల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరవుతారని, అందువల్ల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

గొల్లలపాలెం వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- దొప్పెర్ల, మడుతూరు సరిహద్దులో రాత్రికి రాత్రే రవాణా
- పట్టించుకోని రెండు పంచాయతీల అధికారులు

అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మడుతూరు-దొప్పెర్ల పంచాయతీల సరిహద్దుల్లో గల గొల్లలపాలెం పరిసర ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. మడుతూరుని ఆనుకొని సెజ్‌లో కర్మాగారాలతోపాటు ఇతర అవసరాలకు గ్రావెల్ అవసరం అవుతోంది. ఇక్కడ అనుమతి పొందిన గ్రావెల్ క్వారీలు లేకపోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ స్థలాల్లో గల గ్రావెల్‌ని రాత్రికి రాత్రి ఎక్స్‌కవేటర్లతో తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. మడుతూరు పంచాయతీ ఎరికిరెడ్డిపాలెం సమీపంలో గల గొల్లలపాలెం కొండగెడ్డ పోరంబోకు భూమిలో చక్కని గ్రావెల్ ఉంది. చుట్టూ పంట పొలాలున్నా గెడ్డ పోరంబోకులో మాత్రం మంచి గ్రావెల్ ఉంది. దీనిపై అక్రమార్కుల కన్ను పడింది. గతంలో ఇక్కడ నుంచి భారీగా అక్రమ గ్రావెల్ రవాణా చేశారు. దీంతో ఇక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల పడిన వర్షాలకు గోతులు నీళ్లతో నిండిపోయాయి. ప్రస్తుతం గోతులకు ఇరువైపుల గట్టును తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. అంతేకాక గోతిలోంచి పైకి ట్రాక్టర్లు, లారీలు రావడానికి మార్గాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. పంట పొలాల మధ్యలోంచి ఈ కొండ గెడ్డ ప్రాంతం ఉంది. దీంతో అక్రమ రవాణాదారులు పొలాల గట్ల సరిహద్దుల్లో గ్రావెల్‌ని తవ్వి అక్రమ రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌ని రూ.900 విక్రయిస్తుండగా, లారీ గ్రావెల్‌ని రూ.రెండు వేలకు విక్రయిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఎక్స్‌కవేటర్లతో రాత్రి పూట గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. సరిహద్దు కావడంతో రెండు పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.



గొల్లలపాలెం పంట పొలాల వద్ద గ్రావెల్ తవ్విన దృశ్యం

జ్యోతిరావు పూలేకు నివాళులు

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళోద్ధరణకు మహాత్మ జ్యోతిరావు పూలే అందించిన సేవలు మరువరానివని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరైపు నాగ త్రినాథ గుప్తాతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ మహనీయులను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండలరావు, ఈవోపీఆర్డీ దీపిక, నేతలు, కౌన్సిలర్లు కొల్లి త్రినాథ్, పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, సుంకర మరిడేశ్వరావు, కాళ్ల సీతారామ్, వేల్పుల శేఖర్, డి. నరసింహమూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

రెసిడెన్షియల్ శిక్షణల పేరుతో ప్రధానోపాధ్యాయులను శిక్షించడం తగదని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దిల నానాజీ అన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ వద్ద జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ శిక్షణ కారణంగా హెచ్‌ఎంలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. విజయనగరం జిల్లాలో ఒక హెచ్‌ఎం ఇటువంటి మానసిక ఒత్తిడి కారణంగా మరణించాడన్నారు. ఇటువంటి అనాలోచిత నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, కె.సుభాషిణి, రవికుమార్, కొండబాబు, స్వర్ణప్రసన్న, మారిశెట్టి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, ఎంపీడీఓ కొండలరావు

విశాఖ డెయిరీ ముట్టడిని విజయవంతం చేయండి

- ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు ముర్రాపు సూర్యనారాయణ పిలుపు

మునగపాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆవు పాల ధర తగ్గించినందుకు నిరసనగా డిసెంబరు 2వ తేదీన విశాఖ డెయిరీ ముట్టడి చేపట్టడతామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముర్రాపు సూర్యనారాయణ తెలిపారు. స్థానిక నందిగుడి వద్ద గురువారం రాత్రి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ పాడి రైతులు కష్టార్జితంతో దుబారా చేస్తోందన్నారు. రైతులను ఆదుకోవలసిన డెయిరీ యాజమాన్యం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తగ్గించిన పాల ధరను పెంచాలనే డిమాండ్‌తో డెయిరీ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని, పాడి రైతులు విజయవంతం చేయాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, కౌలు సంఘం జిల్లా నాయకుడు కె.సదాశివరావు, సీఐటీయూ నాయకుడు ఎస్.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో కొక్కిరాపల్లి గురుకుల ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం



రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ స్థానం పొందిన కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులకు బహుమతి అందజేస్తున్న అధికారులు

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ మాణిక్యం తెలిపారు. ఈ పోటీలు గత వారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో గురుకుల విద్యార్థినులు పి. లక్ష్మీప్రియ, బి.త్రివేణి రూపొందించిన వరద విపత్తులు అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం వచ్చిందన్నారు. విద్యార్థినులను తీర్చిదిద్దడంలో కృషిచేసిన గైడ్ టీచర్లు వరలక్ష్మి, కుమారిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు



పోక్సో కేసులో వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోక్సో మిస్సింగ్ కేసులలో వ్యక్తిని అరెస్టు చేసి విశాఖపట్నం జైలుకు తరలించినట్టు సీఐ జి. అప్పన్న తెలిపారు. మండలంలోని చినదర్సాపురం గ్రామానికి చెందిన గుడాల అజయ్‌కుమార్ పోక్సో మిస్సింగ్ కేసులలో నాలుగేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి గాలించి, పట్టుకున్నామన్నారు. నిందితుడిని ఎలమంచిలి కోర్టులో హాజరుపరచగా.. మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ అప్పన్న తెలిపారు. నిందితుడిని ఎస్‌ఐ పురుషోత్తం, సిబ్బంది సహకారంతో పట్టుకున్నట్టు ఆయన చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. పురుషోత్తపురం, పీఎన్‌ఆర్.పేట. పులపర్తి. బయ్యవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో మోహనరావు

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయ ఆవరణలో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఏవో మోహనరావు తెలిపారు. పౌరులు అడిగిన సమాచారాన్ని అధికారులు 30 రోజుల్లో అందించాలని సూచించారు. అన్ని రికార్డులు, రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని సమాచారాన్ని నిబంధనలు ప్రకారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



అమ్మవారి కోసం ముర్రాటలతో ఎదురు చూస్తున్న మహిళలు

ఎస్.రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోముదేవుపల్లిలో మరిడిమాంబ అమ్మవారి జాతరను గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని వీధిల్లో ఊరేగించారు. మహిళలంతా ముర్రాటలు అమ్మవారిపై పోశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగిస్తున్న సమయంలో వెదురు కర్రలతో కొట్టుకుంటూ ఒకరిపై మరొకరు పోటీ పడ్డారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా పేల్చారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సబ్‌జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును గురువారం అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకటశేషమ్మ సందర్శించారు. జైలులోని నిందితులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏఏ నేరాల్లో అరెస్టయ్యారో తెలుసుకుని ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలని సూచించారు. ఈ సందర్భంగా జైలు అధికారులకు, ప్యానల్ న్యాయవాదులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జైలు అధికారి ప్రసాద్, ప్యానెల్ న్యాయవాదులు పీవీ రమణ. దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక బరువుతో మూడు లారీలు సీజ్



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు

అచ్యుతాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధిక బరువుతో వెళుతున్న మూడు లారీలను విజిలెన్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. అనకాపల్లి నుంచి రాంబిల్లి వద్ద గల నేవల్ బేస్‌కి పెద్ద రాళ్లతో లారీలు గురువారం వెళుతుండగా అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అధిక బరువు ఉండడంతో వాహనాలకు సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి

రాంబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రంగనాయకులు కోరారు. గురువారం హరిపురంలో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబిల్లి, పంచదార్ల పశువైద్యులు కె.రఘునాథ్, శైలజలు పాడిపశువులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో ధూళి నాగరాజు, సర్పంచ్ ధూళి బుజ్జి, పాలసంఘం అధ్యక్షుడు ధూళి అప్పారావు, స్కూల్ చైర్మన్ ధూళి అప్పారావు, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీ సర్వే వేగవంతం చేయాలి



నామవరంలో ఇంటి పన్నుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మూర్తి

పాయకరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ గ్రామ పంచాయతీ సర్వేను వేగవంతం చేసి ఇంటి పన్నుల డేటాను ఆన్‌లైన్ చేయాలని డీఎల్‌పీవో ఎస్‌ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి అన్నారు. మండలంలోని పీఎల్.పురం, నామవరం పంచాయతీలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, కార్యదర్శులు వైవీ. సత్యనారాయణ, మల్లికార్జునాచారి, హుస్సేన్, శివరాం, రామగోవిందు పాల్గొన్నారు.

సమగ్రంగా సర్వే చేయాలి : ఎంపీడీవో



ఈదటంలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాశరావు

పాయకరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఇంటింటి సర్వే సమగ్రంగా చేయాలని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు అన్నారు. మండలంలోని పాల్తేరు, ఈదటం సచివాలయాలను గురువారం ఆయన సందర్శించి ఇంటింటి సర్వే, ఎన్‌పీసీఐ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

రైలు ప్రమాదంలో మహిళ మృతి

ఎలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో గ్రామానికి చెందిన మహిళ మృతి చెందినట్టు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రమాదంలో బయ్యవరం గ్రామానికి చెందిన కొయ్య లక్ష్మి(35) గురువారం ఉదయం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో తలకు గాయాలైనట్టు తెలిపారు. సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని, మృతదేహాన్ని తుని ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచామన్నారు. శుక్రవారం ఎలమంచిలి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేస్తారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

నేడు నక్కపల్లిలో ఏయూ హాకీ జట్టు ఎంపిక



హాకీ సాధన చేస్తున్న క్రీడాకారులు

నక్కపల్లి, నవంబరు 28: స్థానిక హాకీ మైదానంలో ఈనెల 29వ తేదీ నుంచి ఆంధ్రా యూనివర్సిటీ ఉమ్మడి విశాఖ జిల్లా పురుషుల హాకీ జట్టు ఎంపిక జరుగుతుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, పీడీ కె.దుర్గారావు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఏయూ టీఎం తరపున డిసెంబరు 3 నుంచి 8వ తేదీ వరకూ చెన్నైలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులు నక్కపల్లి చేరుకుని గురువారం హాకీ సాధన చేశారు. ఈ మేరకు ఏర్పాట్లను ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. విజయ్ మోహన్, ఏయూ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ పీడీ డాక్టర్ ఎ.పల్లవి, ఎస్.జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, సెక్రటరీ కొల్నాటి తాతాజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కారిడార్ రైతులకు న్యాయం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు

నక్కపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తి న్యాయం చేసే వరకూ స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపన చేయకూడదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. గురువారం ఆయన నక్కపల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2015 నుంచి 2017 వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎకరానికి రూ.18 లక్షలు పరిహారం ఇచ్చి సేకరించిన భూములను ఇప్పుడు ప్రభుత్వం ఆర్సెలాల్ మిట్టల్‌నిప్పన్ కంపెనీని ఎకరం రూ. 51.39 లక్షలకు విక్రయించాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల రైతులు బాగా నష్టపోతారని, భూములు గల రైతులకు న్యాయం చేయాలని, పూర్తి స్థాయిలో ఇళ్లకు, భూములకు ప్యాకేజీ, పరిహారం ఇచ్చిన తరువాత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలా చేయకుండా ప్రధాని నరేంద్రమోదీ నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న స్టీల్‌ప్లాంట్‌కు వర్చువల్‌గా ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

9 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు నరికించడానికి శుక్రవారం మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దిబ్బపాలెం, భోగాపురం, జంగులూరు, కుమారపురం, దుప్పితూరు, మార్టూరు, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, లంక ధర్మవరంలలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం రెండు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మూలజంపలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దిన్‌బాబు, నూకన్నదొర

రాంబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలజంప గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డును రూ.8 లక్షలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని అన్ని పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, జనసేన పార్టీ నాయకుడు షేక్ నాగురు, గ్రామ సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ పి.గోవింద, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు నర్సీపట్నం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్.రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు పనులకు శుక్రవారం ఉదయం దార్లపూడి వద్ద రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం గురువారం తెలిపారు. అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల మండలం ఇందేశమ్మవాక సమీపంలో వరకు రూ.24.32 కోట్లతో 9.4 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం చేపడతారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

రాంబిల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ నర్సాపురం, కజిరెడ్డిపాలెం గ్రామ సమీపాల్లో రెండు పేకాట స్థావరాలపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేసినట్టు రాంబిల్లి పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 6 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

శ్మశాన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- శ్రీరాంపురం నాయకుల డిమాండ్

పాయకరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో శ్మశానం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెరుమళ్ల శివకుమార్, టీడీపీ నాయకుడు చించలపు గోవిందు కోరారు. తాండవ నది ఆవల వైపు ఉన్న దిబ్బ మీద దహన సంస్కారాలు నిర్వహించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఒకప్పుడు 11 ఎకరాలకు పైగా ఉన్న రుద్రభూమి నేడు 11 సెంట్లు కూడా లేదన్నారు. తాండవ నది ఆవల వైపు 5 ఎకరాల భూమి ఉందని, దానిని అభివృద్ధి చేసుకోవడానికి నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు, అధికారులకు ఎన్ని పర్యాయాలు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సమావేశంలో చర్చించినా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రజాదర్బారును సద్వినియోగం చేసుకోండి

పాయకరావుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం నక్కపల్లిలో నిర్వహించనున్న ప్రజాదర్బారును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ప్రజాదర్బారుకు జిల్లా ,మండల స్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతున్నందున ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

అంటరానితనంపై పూలే పోరాటం

▸ మునిసిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ బో సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుల వ్యవస్థ, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతల నుంచి ప్రజలను కాపాడేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారని మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా గురువారం పట్టణంలోని కొత్తవీధి నుంచి పెదబొడ్డేపల్లి వెళ్లే రోడ్డులో పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యురాలు రోజా, అయ్యరక బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీను, వైసీపీ నాయకులు తమరాన శ్రీను, చీటీల రాము, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీల జిల్లా నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని గుండాల జంక్షన్ వద్ద గల ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా ఓ.మహేష్ (చోడవరం), కె.ధర్మారావు (పరవాడ), జనరల్ సెక్రటరీగా సీతామహాలక్ష్మి (మాకవరపాలెం), జాయింట్ సెక్రటరీగా జి.సత్యనారాయణ (ఎస్.రాయవరం), కోశాధికారిగా ఎం.వెంకటలక్ష్మి (కశింకోట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విస్తరణ అధికారుల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఈవోపీఆర్డీలు హాజరయ్యారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసు నమోదు

దేవరాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామంలో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్ద రు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు చోడవరం ఎక్సైజ్ ఇనస్పెక్టర్ కె.వి. బాపునాయుడు గురువారం తెలిపారు. ముందస్తు సమాచారంపై హెడ్ కానిస్టేబుల్ ఎం.అప్పారావు, సిబ్బంది దాడి చేశారన్నారు. మద్యం సీసాలతో వస్తున్న ఎస్.అప్పారావు, కె.నారాయణరావును పట్టుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 39 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

అన్నదాతల్లో తుఫాన్ అలజడి



నాతవరంలో నేలకొరిగిన వరిచేను

▸ ఈదురు గాలులు వీస్తుండడంతో పలుచోట్ల నేలకొరుగుతున్న వరి

▸ చేతికి పంట అందే సమయంలో పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయోనని ఆందోళన

▸ ఉత్తరాంధ్రలో భారీవర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ చెబుతున్నా వీడని భయం

నాతవరం/ కృష్ణాదేవిపేట, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : తుఫాన్ ప్రభావం కారణంగా గురువారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి, ఈదురు గాలులు వీస్తుండడంతో అన్నదాతలు ఆందో ళన చెందుతున్నారు. ఉత్తరాంధ్రలో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురుస్తాయి తప్ప, భారీవర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నా పంట చేతికి అందే సమయంలో ఎప్పుడు ఎలా ఉంటుందోననే ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే నాతవరం, గుమ్మిడిగొండ, వెదురుపల్లి తదితరచోట్ల ఈదురు గాలుల కారణంగా వరి చేళ్లు నేలకొరిగాయి. దీంతో చాలా చోట్ల పంట పండినా తాజా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కోతకు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. ఇదిలావుంటే గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట, చోద్యం, గింజర్తి, కొంగసింగి తదితర గ్రామాల్లో పొలాల్లో కోసిన వరి పనలు దర్శనమిస్తున్నాయి. పంట కోత దశకు రావడంతో పలుచోట్ల రైతులు తుఫాన్‌ను లెక్కచేయకుండా వరికోతలు కోశారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పనలను పొలాలగట్లపై పెట్టుకోగా, మరికొన్ని చోట్ల కోసిన పనలను పొలాల్లోనే వదలేశారు. ఇటు వంటి సమయాల్లో వర్షాలు కురిస్తే తమకు నష్టం తప్పదని రైతులంతా ఆందోళన చెందుతున్నారు.



చోద్యంలో కోసిన వరి పనలను పొలంలో ఉంచిన దృశ్యం

జి.కోడూరులో ఘనంగా నల్లమారెమ్మ పండుగ

▸ అమ్మవారికి స్పీకర్ అయ్యన్నతో పాటు భక్తుల పూజలు



నల్లమారెమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్పీకర్ అయ్యన్నకు చిత్రపటాన్ని అందిస్తున్న నిర్వాహకులు

మాకవరపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరులో నల్లమారెమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో గల అన్‌రాక్ కంపెనీలో నల్లమారెమ్మ గుడి ఉంటుంది. అయితే ఇక్కడ అమ్మవారి విగ్రహం ఉండదు, చెట్లకు మాత్రమే పూజలు చేస్తారు. ఉదయం గ్రామంలోని పశువులను ఈ వేప చెట్టు వద్దకు ర్యాలీగా తీసుకొని వెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గుడివద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. నేల డ్యాన్స్‌లు, భజనలు, తప్పిటగుళ్లతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో గవర కార్పొరేషన్ చైర్మెన్ మళ్ల సురేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు మళ్ల జయరాం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, అల్లు రామునాయుడు, జోగిపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

గొలుగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఇద్దరిపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈనెల 17వ తేదీన ధారమఠం నుంచి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారన్నారు. మార్గ మధ్యలో గొలుగొండ గ్రామానికి చెందిన సరమండ రవిబాబు, ముత్యం ఉదయ్, వారా సాగర్‌లు మద్యం మత్తులో పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన ఈ ఇద్దరిపై దాడికి పాల్పడ్డారని ఎస్‌ఐ చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టుకు తరలించినట్టు వివరించారు.

సీసీ రోడ్లపై గుంతలకు మరమ్మతులు

నర్సీపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని సీసీ రోడ్లపై పడిన గుంతలకు అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. ఇందు కోసం మూడు లక్షల రూపాయల సాధారణ నిధులను ఖర్చు చేస్తున్నారు. 28 వార్డులలో సీసీ రోడ్లపై 32 గుంతలు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ జె.సరేంద్ర తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలకు తపాలా బ్యాంకింగ్ సేవలు

▸ పాత, కొత్త ఖాతాలకు ఎన్‌డీసీఐ అనుసంధానం

▸ ఖాతాదారులకు స్మార్ట్ కార్డు రూపంలో పాస్ బుక్

నర్సీపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలకు తపాలా బ్యాంకింగ్ సేవలు మరింత విస్తరిస్తున్నాయి. ఇండియా తపాలా పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబి) సేవలు 2018 సెప్టెంబరు ఒకటి నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆధార్ నెంబరుతో పోస్టల్ బ్యాంక్ ఖాతాలు తెరిచారు. ఇప్పుడు ప్రత్యేక డ్రైవ్ ద్వారా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌డీసీఐ)కి పోస్టల్ ఖాతాలను అనుసంధానం చేస్తున్నారు. కొత్త ఖాతాదారుల నుంచి ఆధార్, బయోమెట్రిక్ తీసుకుంటున్నారు. ఎన్‌డీసీఐకి బ్యాంక్ ఖాతా లింక్ చేయడం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయి. ఎన్‌డీసీఐకి బ్యాంక్ ఖాతా లింక్ చేయకపోవడం వలనే ఖాతాదారులు బ్యాంకులు చుట్టు సంక్షేమ పథకాల డబ్బులు పడలేదని తిరుగుతుంటారు. నర్సీపట్నం ప్రధాన తపాలా కార్యాలయంలో గత 15 రోజుల్లో పాత, కొత్త కలిపి ఎన్‌డీసీఐకి అనుసంధానం చేసిన పోస్టల్ బ్యాంక్ ఖాతాలు సుమారు 10,300 వరకు ఉన్నాయి. కొత్తగా పోస్టల్ బ్యాంక్ ఖాతాలు తెరవాలనుకుంటే ఎటువంటి డాక్యుమెంట్లు, దరఖాస్తులు అవసరం లేదు. ఆధార్, బయోమెట్రిక్ తో రూ.200లు మినిమమ్ బ్యాలెన్స్‌తో నిమిషంలో పోస్టల్ బ్యాంక్ ఖాతాలు తెరుస్తున్నారు. బ్యాంక్ పుస్తకంతో పని లేకుండా స్మార్ట్ కార్డు ఇస్తున్నారు. ఖాతాదారులు డబ్బులు దాచుకోవడానికి, తీయడానికి ప్రత్యేంగా ఫారాలు నింపడం వంటివి చేసే పని లేదు. పోస్ట్ ఆఫీసుకు వచ్చి స్మార్ట్ కార్డు ఆధారంగా బయోమెట్రిక్ వేసి సులభంగా డబ్బులు తీసుకోవచ్చు అని పోస్టల్ అధికారులు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఒకటే ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉంటుంది. ఇతర బ్యాంకుల ఖాతాలోని డబ్బులు కూడా (రూ.10వేలు) పోస్ట్ ఆఫీసులో విత్‌డ్రా చేసుకోవచ్చు. జాతీయ బ్యాంకులలో ఈ వెసులుబాటు లేదు.



బయోమెట్రిక్ తీసుకుంటున్న దృశ్యం

పల్లె ప్రజలకు ఎంతో ఉపయోగం..

జాతీయ బ్యాంక్ సేవలు అందుబాటులో లేని గ్రామాలలో పోస్టల్ బ్యాంక్ సేవలు విస్తరించి ఉన్నాయి. నర్సీపట్నం ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో 21 ఉప తపాలా కార్యాలయాలు, 295 బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులు విస్తరించి ఉన్నాయి. సబ్ పోస్ట్ ఆఫీసులు, బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులు డివిజన్ తపాలా కార్యాలయం పరిధిలో పనిచేస్తుంటాయి. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు ఖాతాలో పడినప్పుడు విత్‌డ్రా చేయడం కోసం జాతీయ బ్యాంకులకు వచ్చే పని లేదు. దగ్గరలోని గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో బయోమెట్రిక్ వేసి నగదు విత్ డ్రా చేసుకోవచ్చు. రిక్వెస్ట్ పెట్టుకుంటే పోస్ట్‌మేన్ నేరుగా ఇంటికి తీసుకు వచ్చి అందజేస్తారు. బయోమెట్రిక్ పడక పోతే ఓటీపీ ద్వారా కూడా డబ్బులు తీసుకోవచ్చు.

సభ్యత్వ నమోదు లక్ష్యం చేరుకుంటాం

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు మూర్తియాదవ్



ఎమ్మెల్యే రాజు నుంచి వివరాలు తీసుకుంటున్న మూర్తియాదవ్

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మూర్తి యాదవ్ తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాల నమోదుపై స్థానిక నేతలతో పాటు, ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ఎస్ రాజుతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధి మండలాల వారీగా పార్టీ సభ్యత్వ నమోదు తీరుపై మూర్తి యాదవ్‌కు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు పాల్గొన్నారు

సైకిల్‌పై శబరిమల యాత్ర



శబరిమల యాత్రకు వెళ్తున్న బొడ్డపు స్వామి

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నవరం వీధికి చెందిన బొడ్డపు స్వామి సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. అయ్యప్ప దీక్ష పూర్తి చేసిన స్వామి గురువారం ఉదయం స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఈ సైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి, పట్టణంలోని అయ్యప్పస్వాములు, చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆకుల వాసు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ఓటర్ల నమోదు



ఓటు హక్కు నమోదు చేస్తున్న అధికారులు

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఓటు హక్కుకలిగిన 110 మంది విద్యార్థులు తమవివరాలు అందించి తమ ఓటు హక్కును నమోదు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డి. సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

'పల్లె వనం'తో మొక్కల పరిరక్షణ

మాడుగుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పల్లె వనం కార్యక్రమంలో భాగంగా మాడుగుల సామాజిక ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి పరిరక్షణ చేస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో నిరుపయోగంగా తుప్పలు పిచ్చిమొక్కలతో ఉన్న ఎకరా విస్తీర్ణాన్ని ఎక్సకవేటర్‌తో చదును చేసి శుభ్రం చేయించారు. అనంతరం జామ, కొబ్బరి తదితర ఐదు రకాల మొక్కలను నాటించారు. వీటిని ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా పరిరక్షించేందుకు ప్రతిపాదించినట్టు ఆయన చెప్పారు. ఈ ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిపోతున్న అటవీ కలప

▸ రావికమతం మండలంలో దందా ▸ అక్రమార్కులపై అధికార యంత్రాంగం ఉదాసీన వైఖరి

రావికమతం, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం, కన్నంపేట పరిధిలో కొండ కలపను కొందరు గత పదిహేను రోజులుగా నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. దీనిపై ఫిర్యాదులందినా అటవీ శాఖ, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై ఈ గ్రామాలకు చెందిన గల్లా రాజేశ్వరావు, సోమిరెడ్డి జగ్గరావు, శేషూరి కృష్ణ తదితరులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు కలపను తరలించుకుపోయి రూ. లక్షలు ఆర్జిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మర్రివలస రెవెన్యూ పరిధిలో పాండవులకొండ సర్వే నంబర్ 212 లో సుమారు 750 ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. దీనిలో 2008లో వమ్మవరం గ్రామస్థులకు 52 మందికి కొంత భూమిని డీ పట్టాలుగా ఇచ్చారు. అయితే, అయితే పట్టాలిచ్చినా లబ్ధిదారులు సాగు చేయడంలేదు. ఈ పట్టాలిచ్చిన భూమిని ఆనుకొనిఉన్న కొండలో నేరేడు, మామిడి, అకేషీయా తదితర కొండ కలప విస్తారంగా ఉంది. ఈ పట్టాదారులను అడ్డంపెట్టుకొని వమ్మవరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, వార్డు సభ్యుడు అండతో కొండపైకి ట్రాక్టర్లు వెళ్లే విధంగా ఇటీవల రోడ్డు వేయించారు. ఆయన అక్రమార్కులతో గత 15 రోజులుగా కొండపై ఉన్న చెట్లను అక్రమంగా నరికి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్టు ఫిర్యాదారులు పేర్కొంటున్నారు.



మర్రివలస అడవి రాజుల కొండపై నరికివేసిన కలప



కలప రవాణాకు కొండపైకి వేసిన రోడ్డు

కేసులు నమోదు చేస్తాం: తహసీల్దార్

ఈ విషయమై తహసీల్దార్ బి.వెంకట రమణను సంప్రదించగా గురువారం హెచ్‌డీటీ,ఆర్‌ఐ, వీఆర్‌వోలను పంపించామన్నారు. కలప నరకడం వాస్తవమేనని గుర్తించారన్నారు. డీ పట్టాలు పొందిన రైతులు ఎవరూ సాగులో లేరన్నారు. కలప అక్రమ నరికివేత దారులను గుర్తించామని, వీరిపై పోలీసు కేసు పెట్టనున్నట్టు చెప్పారు. అక్రమ దారులను ఎవర్ని విడిచిపెట్టేదిలేదన్నారు. ఆ కొండపైకి ఎవరూ వెళ్లకుండా శుక్ర, శని వారాల్లో ట్రెంచ్‌లు తవ్విస్తామన్నారు. అక్రమంగా నరికి కలపను కూడ స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ భూములపై జిల్లా కలక్టరుకు సమగ్ర నివేదిక పంపిస్తామని తహసీల్దార్ వివరించారు.

117 జీవో రద్దు చేయాలి : పీఆర్‌టీయూ

చోడవరం, నవవబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో 117ని రద్దు చేయాలని పీ ఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని స్కూళ్లలో పీ ఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, జీవో 117ని రద్దు చేయాలని, పీఆర్‌సీ కమిటీని పునరుద్ధరించాలన్నారు. త్వరలో జరనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షుడు ఎం. వీ. స్వామి, సంఘం నాయకులు జి,. సింహాద్రి, కె. త్రినాదరావు, టీవీ శేషగిరిరావు, ఎం, వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

దేవరాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు శివారు నగరంపాలెంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తామర్ల కొండబాబుకు దేవరాపల్లి ఎంపీటీసీ సభ్యుడు మొల్లి.కృష్ణమూర్తి గురువారం నిత్యావసరాలను అందజేశారు. కూరగాయలు, నూనెతో పాటు బియ్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోడెల. బుజ్జి , మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు మొసలి. పైడిరాజు, మంగరాజునాయుడు, తమ్మయ్యరాము తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బూడి.ముత్యాలనాయుడు

దేవరాపల్లి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు అన్నారు. తారువలో పూలే వర్థంతి పురష్కరించుకుని ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా పూలే పోరాడారన్నారు. జడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, సర్పంచ్ చింతల వెంకట సత్య వెంకటరమణ తది తరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో క్షయవ్యాధి దూరం



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి

చీడికాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రత తోనే క్షయవ్యాధిని నిరోధించవచ్చునని క్షయవ్యాధి జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.అయ్యప్ప రెడ్డి అన్నారు. మండలంలో కోనాం సబ్‌సెంటర్ కార్యాలయం లో ఆశవర్కర్‌లతో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండువారాలకు మించి దగ్గు, సాయంత్రం వేల జ్వరం, ఆకలి మందగించడం ,బరువుతగ్గడం తదితర లక్షణాలున్న వారికి ఉమ్మిపరీక్ష చేయించాలన్నారు. చీడి కాడలోనే ఈ పరీక్ష కేంద్రం అందుబాటు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, టీబీసూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేయాలి



సూచలందిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు

చీడికాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత తగ్గేవరకూ వరి కోతలు వాయిదా వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు సూచించారు. మండలంలో తునివలస, పెదగోగాడ, జి.కొత్తపల్లి, చుక్కపల్లి గ్రామాల్లో గల రైతుల పొలాల వద్దకు గురువారం ఆయన వెళ్లి రైతులతో మాట్లాడారు. నూర్పులు పూర్తయిన ధాన్యం సురక్షిత ప్రాం తాలకు తరలించాలన్నారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వరి చేను తడిసి గింజ రంగు మారకుండా ఉండటానికి 50 గ్రాముల కళ్లు ఉప్పు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని కోరారు. ప్రధానమంత్రి పసల్‌బీమా నమోదు చేసుకుంటే పంటలకు నష్టం జరిగే బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎ.కృష్ణవేణి, సిబ్బంది లోకేశ్, రాజా, రంగనాథ్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: తఫాన్ నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు రైతులను కోరారు. గురువారం మండలంలోని బి.కింతాడలో పంట పొలాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే కోసిన వాటినివరి పనలను కుప్పలు వేయాలని,వాటిపై టార్పాలిన్‌లు కప్పి తడవకుండా పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ, కార్యదర్శి అప్పారావు, సర్పంచ్ బూరే బాబూరావు పాల్గొన్నారు.

గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలు సీజ్

రోలుగుంట, నవంబరు (ఆంధ్రజ్యోతి) 28: మండలంలోని కుసర్లపూడి శివారు రోలుగుంట-మాకవారపాలెం సరిహద్దుల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్ యజమానులకు రూ.12వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ నాగమ్మ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి..

దేవరాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు గురువారం తెలిపారు. వేచలం , ములకలాపల్లి, ముషిడిపల్లి, ఎ. కొత్తపల్లి, కె.ఎం. పాలెం తదితర గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీడికాడ మండలంలో..

చీడికాడ: మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 గంటలనుంచి ఒంటి గంటవరకు మండలంలోని 13గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. చీడికాడ, తురువోలు, తంగుడుపల్లి, అర్జునగిరి, పెదగోగాడ, జికొత్తపల్లి, వరహాపురం, జైతవరం, చుక్కపల్లి, బైలపూడి, ఎ.అగ్రహారం, వింటిపాలెం, తునివలస, చినగోగాడ గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వరి కుప్పలు దగ్ధం

ముంచంగిపుట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో గురువారం కళ్లాల వద్ద 11 వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామ సమీపంలో కళ్లాల వద్ద ఇటీవల కోసిన వరి పంట కుప్పలను నూర్పులకు సిద్ధంగా ఉంచారు. మధ్యాహ్నం సమయంలో అక్కడికి రైతులు వచ్చే సరికి అవి కాలిపోతూ కనిపించాయి. దీంతో రైతులు, స్థానికులు బిందెలతో నీళ్లు చల్లి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదు. వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధిత రైతులు రాంబాబు, జీనబంధు, బొగ్గు, లేకోస్, కార్తీక్, మొదునే, సుందరమ్మ, సూర్యనారాయణపడాల్, ధనుర్జయ్, రాజు, రామన్నలు బోరున విలపించారు. ఆర్థికంగా నష్టపోయామని వారు వాపోయారు. ఆకతాయిలు వరి కుప్పలకు నిప్పు పెట్టి ఉంటారని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వివరాలు సేకరించి పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ నర్సమ్మ ఈ సందర్భంగా తెలిపారు.

8న చెక్కలమద్ది, గుమ్మిరేవుల సాగు నీటి సంఘాల ఎన్నిక

సీలేరు, నవంబరు 28 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెక్కలమద్ది, గుమ్మిరేవుల సాగు నీటి సంఘాల ప్రతినిధుల ఎన్నిక డిసెంబరు 8 వతేదీన నిర్వహించనున్నట్టు తహసీల్దార్ టి. రామకృష్ణ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను గతంలో ప్రకటించామని, నోటిఫికేషన్ డిసెంబరు 5న విడుదల కానుందన్నారు. ఎన్నికలకు పోలింగ్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. ఎన్నికలు నిర్వహించే రోజునే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసహరణ జరుగుతుందన్నారు.

ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ డిపార్టుమెంట్ అధ్యాపకులు కె. సంతోషి తెలిపారు. గురువారం ఆమె మట్లాడుతూ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీఈడీ, బీటెక్, ఎంటెక్, ఐటీఐ, డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణులైన యువత ఉద్యోగాల కోసం కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 29 నుంచి డిసెంబరు మూడో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

సచివాలయాల్లో సేవలపై ఆరా

అనంతగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉత్తమ సేవలందించాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ అన్నారు. మండలంలోని టోకూరు సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉత్తమమైన సేవలను అందించాలన్నారు. అనంతరం ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన: డీఎంహెచ్‌వో



పాడేరులో స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో హెచ్ఐవీ నిర్మూలన సాధ్యమని డీఎంహెచ్‌వో సి. జమాల్‌బాషా అన్నారు. డిసెంబరు ఒకటి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్ఐవీ/ఎయిడ్స్ స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఎయిడ్స్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, దానిపై అవగాహన ఏర్పరచుకుని సురక్షితంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణాధికారి రామచందర్, ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుతో జీవితాలు నాశనం: సీఐ



గంజాయి సాగుపై డ్రోన్ సర్వే పరిశీలిస్తున్న అరకు సీఐ హిమగిరి, అధికారులు

డుంబ్రిగుడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుచేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని అరకు సీఐ హిమగిరి అన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు.. మండలంలోని అమలగుడ, కింజేరు, వసబంద, బీజువలస గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో గురువారం డ్రోన్లతో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పలు సూచనలు చేశారు. గంజాయి సాగు చట్టరీత్యానేరమన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలపై గిరిజనులు దృష్టిపెట్టి, ఆర్థికంగా ఎదగాలని, సూచనలు చేశారు. పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



గాంకొండ వాసులు శ్రమకోర్చి నిర్మించుకున్న కర్రల వంతెన



వాగు అవతలనుంచి వరి చేను తీసుకువస్తున్న గిరిజనులు

కట్టెల వంతెనతో కష్టాల నుంచి గట్టెక్కారు

గాంకొండ సమీపంలో గెడ్డపై రాకపోకలకు వీలుగా ఏర్పాట్లు

కల్వర్టు నిర్మించాలని గిరిజనులు వేడుకోలు

కొయ్యూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటను వాగు దాటించేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ స్థితిలో రైతులే ఆలోచించి కర్రలతో వంతెన నిర్మించుకుని కష్టాలనుంచి గట్టెక్కారు. వివరాలివి.. మండలంలో నడింపాలెం పంచాయతీ గాంకొండ గ్రామస్థులు కొండవాగు ప్రవాహానికి అవతల సాగు చేసిన పంటను ఇంటికి తెచ్చుకునేందుకు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ భూముల్లో పండించిన పంటలు రక్షించుకునేందుకు వీరంతా రాత్రి పగలు తేడా లేకుండా వాగును దాటుకుంటూ వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో వాగుపై కనీసం కాజ్‌వే అయినా నిర్మించాలని పలు పర్యాయాలు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించి సాగు చేసిన పంట ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చింది. పంటకు రక్షణ కరువవడంతో గ్రామస్తులంతా ఓ నిర్ణయానికి వచ్చారు. వాగును దాటేందుకు అడవిలో దొరికే కర్రల సాయంతో వంతెన నిర్మించాలని తలపెట్టారు. కొండవాగు ప్రవాహంలోని బండ రాళ్లను పిల్లర్లుగా వినియోగించుకుని వాటిపై కర్రలను పేర్చి వంతెన నిర్మించారు. రాకపోకలకు వీలుగా బలమైన ఇనుప తీగలతో పేర్చిన కర్రలు కట్టి మరీ వంతెన నిర్మించారు. దీంతో వాగు అవతల ఒడ్డున వేసిన వరి పంటను దీనిపైనుంచి ఇళ్లకు సులభరీతిలో తరలిస్తున్నారు. గతంలో పొలాల వద్దనే కుప్పలుగా పెట్టటం వలన వాటిని పరిరక్షణకు రాత్రి వేళల్లో కాపుకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ సమస్యలేదని గ్రామానికి చెందిన రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వతంగా వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువతీ యువకులు సామాజిక మాధ్యమాలను సక్రమమైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది ఎస్. మోహనకృష్ణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి అధ్యక్షతన గురువారం మాధ్యమాల దుష్ప్రభావంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సామాజిక మాధ్యమాలకు సంబంధించి శిక్షలు, యాక్ట్‌లను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్. రసూల్, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు జి.గౌరీశంకరరావు, సీహెచ్.అచ్యుత్, వి.శంకరరావు, జేకేసీ కో-ఆర్డినేటర్లు జి.భాస్కరరావు, జి.గోవిందరాజులు, కె.అప్పలనాయుడు, కొత్తంనాయుడు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం



సంతలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు తదితరులు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై గురువారం ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గుత్తులపుట్టు వారపు సంతలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిసెంబరు 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌కు సంబంధించిన వస్తువులు వాడకంపై నిషేధం అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని కోరారు. సంతలో వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు అమ్మకాలు చేపట్టవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తులపుట్టు సర్పంచ్ సాగిన బాబూరావు పడాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళా



జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు లెటర్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

పాడేరురూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా గురువారం డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. అపోలో ఫార్మసీ, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్, మదర్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొన్నాయి. 42 మంది యువతీ యువకులు హాజరు కాగా 12 మంది ఎంపికయ్యారు. వీరికి ప్రిన్సిపాల్ లెటర్లు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సంగీత, జేకేసీ కో-ఆర్డినేటర్ జి.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పీవో జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు అప్పలనాయుడు, కొత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఇంజనీర్ల జిల్లా, డివిజన్ కమిటీల ఎన్నిక



విద్యుత్ ఇంజనీర్ల జిల్లా సంఘం నూతన కమిటీ

పాడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న ఇంజనీర్ల జిల్లా, డివిజన్ కమిటీలను గురువారం స్థానిక కాఫీ హౌస్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఎన్.సోలేమురాజు (రంపచోడవరం) కార్యదర్శిగా ఎం.వెంకటరమణ (జి.మాడుగుల), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.భాస్కరరావు (పాడేరు), కోశాధికారిగా వి.శ్రీనివాస్ (పాడేరు), పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా వి.ప్రభాకరరావు (చింతపల్లి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.త్రినాధరావు (అరకులోయ), కోశాధికారిగా జే.రామునాయుడు (పాడేరు), మరి కొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఇంజనీర్ల నూతన జిల్లా, కమిటీలు ఈసందర్భంగా పేర్కొన్నాయి.

'సాంఘిక సంక్షేమ అధికారిని సరెండర్ చేయడం సరికాదు'

గూడెంకొత్తవీధి, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మొల్ల శ్యామలను అకారణంగా హెచ్ క్వార్టర్‌కు సరెండర్ చేయడాన్ని డీటీఎఫ్ జీకెవీధి మండల శాఖ తరఫున ఖండిస్తున్నట్టు యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్. వినోద్‌కుమార్, ఎం. లక్ష్మణరావులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌పై చర్యలు తీసుకునేందుకు మెమోలు జారీ చేశారన్నారు. అనంతరం శ్యామలపై ఎటువంటి విచారణ చేపట్టకుండా సదరు వార్డెన్‌కు కొమ్ముకాస్తూ తిరిగి నిష్కారణంగా చర్యలు తీసుకోవడం సరి కాదన్నారు. శ్యామలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె జీనబంధు, కోశాధికారి డి రవిప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పథకం పనులు పారదర్శకంగా జరిగే విధంగా అధికారులు చూడాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 2023-24లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు జరిగాయి. ఇందులో గుర్తించిన అంశాలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రజా వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగ మాట్లాడుతూ అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీల మస్టర్లు సకాలంలో వేయాలని సూచించారు. ఫిర్యాదులు అందితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 23 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలు లేక పోవడం, వేతనదారులకు కూలి మొత్తం తక్కువగా పడటంపై సోషల్ ఆడిట్ అధికారులు ప్రజావేదికలో తెలియజేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల్లో సామాజిక తనిఖీల్లో రూ.33.816వేలు రికవరీ చేశామన్నారు. మరో రూ27.200 అపరాధ రుసుం విధించనున్నట్టు చెప్పారు. ఈ పథకంలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా ప్లాంటేషన్ చేయించాలని ఉపాధి సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఆడిషన్ విజిలెన్స్ అధికారి వెంకటేశ్వరరావు, ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి



బొర్రగొందిలో కోళ్ల మదర్ బ్రీడర్ ఫాం ప్రారంభిస్తున్న పశుసంవర్ధక అధికారులు

పాడేరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవాలని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్.సీహెచ్ నర్సింహులు అన్నారు. మండలంలోని మారుమూల బొర్రగొంది పీవీటీజీ గ్రామంలో ముప్పల శోభన్ బాబు అనే రైతు ద్వారా అమృత వెల్ఫేర్ సొసైటీ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన కోళ్ల మదర్ బ్రీడర్ ఫామ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ గిరిజన రైతులకు అమృత సంస్థ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోళ్ల పెంపకాని ముందుకు రావాలన్నారు. కోళ్లకు వ్యాక్సిన్లు ఉచితంగా అందిస్తామన్నారు. గోకులం పథకం ద్వారా పశువులు, మేకలు, కోళ్లకు షెడ్‌లు ఏర్పాటుకు గిరిజన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి రాజీవ్ కిశోర్, పశువైద్య సిబ్బంది శ్రీను, ఉమా మహేష్, కోటేశ్వరరావు, అమృత సంస్థ సిబ్బంది రోజ్‌మేరీ, వినోద్, గంగతల్లి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు అడ్డగింత

హుకుంపేట అక్టోబరు 28 ఆంధ్రజ్యోతి: మండలంలోని కోట్నాపల్లి పంచాయతీ పరిధిలోని ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని మారేల గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం తమ గ్రామ సమీపంలో గల గెడ్డ వద్ద ఇసుక వాహనాల తిరుగుతున్న రోడ్డును మూసి వేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ అక్రమంగా వ్యాపారులు ఇసుక భారీ తరలిస్తు ఉండటంతో గెడ్డ వద్ద పెద్ద పెద్ద గోతులపడి తీ వ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మరోవైపు స్థానికులు తమ ఇళ్ల నిర్మాణానికు అధిక ధరలతో ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఈ నేపథ్యంలో అధికారుల స్పందించి అక్రమంగా తవ్వకాలు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చెరువు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, న వంబరు 28 , (ఆంధ్ర జ్యోతి) : జీకేవీధి మండ ల పరిధి పెదవలస పంచాయతీ రంపులలో చెరువు అభివృద్ధి, వీధి డ్రైన్ నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ కృష్ణవంశీ, ఎంపీపీ బోయిన కుమారి శంకుస్థాపన చేశారు. ఉపాధి పథకం నిధులు రూ. 6 లక్షలతో చెరువు కాలువ పనులు చేపట్టనున్నట్టు ఈసందర్భంగా సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ జేఈఈ జ్యోతిబాబు వైస్ ఎంపీపీ ఆనంద్, బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీ టీసీ సభ్యుడు కృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకులు బాలయ్య, త్రిమూర్తులు, కూటమి నాయకులు, వార్డు సభ్యులు తదితర్లు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం: ఏవో

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికతో గిరిజన రైతులు అప్రమత్తం కావాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు అన్నారు. గురువారం మండలంలోని కందులగాది, మల్లవరం గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. ఈ మేరకు ఇప్పటికే కోతలు చేసుకున్న వరి, రాగి పనలను కుప్పగా వేసుకుని తడవకుండగా టార్పాలిన్లు కప్పాలన్నారు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు.

చోడి పంట సాగుపై రైతులకు శిక్షణ

ముంచంగిపుట్టు: పొలంబడిలో భాగంగా ఏవో శ్రీనివాసబాబు చోడి పంట సాగుపై గిరి రైతులకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని పోలిపుట్టు, మొంజాపుట్టు గ్రామాల్లో గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. చోడి రైతులకు మేలైన సాగు పద్ధతులు, పురుగు మందులు వాడటంతో అనర్థాలను వివరించారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుదాం...: పీవో



చాపరాయి వద్ద వ్యాపారులకు పలు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రదేశాలు పరిశు భ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్వచ్ఛత డ్రై కార్యక్రమంలో భాగంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. పర్యాటకుల సౌకర్యాలనుతెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యాటకాన్ని ఎంత పరిశుభ్రంగా ఉంచితే.. మనమంతా ఆరోగ్యంగా ఉంటామని, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు తదితర వాటిని జలపాతం వద్ద పడవేయకుండా.. డస్ట్‌బీన్లు ఉపయోగించాల కోరారు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు పంచాయతీ ద్వారా ఆశీల వేలంపాటను నిర్వహించేవిధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, డిప్యూటీ తహసీల్దార్ బుజ్జిబ్, కార్యదర్శి విజయ్, టీడీపీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'



ముంచంగిపుట్టులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి

ముంచంగిపుట్టు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం యూటీఎఫ్ ఆ ధ్వర్యంలో ఆమె మండలంలోని జోలాపుట్టు, లబ్బూరు, పనసపుట్టుతో పాటు మండల కేంద్రంలోని పాఠశాలల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీగా తనను శాసన మండలికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, గోపి, పుండరీ, దయానిధిలతో పాటు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు : డీఎల్‌పీవో



తాజంగి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం సమస్య తలెత్తకుండగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పాడేరు డీఎల్‌పీవో పీఎస్ఎన్ కుమార్ అన్నారు. గురువారం లంబసింగి, తాజంగి గ్రామ సచివాలయాన్ని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎన్‌పీసీఐ బ్యాంక్ లింకేజీ, స్వర్ణ పంచాయతీల నమోదు, గృహాల జియోట్యాగ్‌ను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. చింతపల్లి మండలంలో లంబసింగి, తాజంగి, పెదబరడ, గొందిపాకలు పంచాయతీల పరిధిలో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారన్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది ఎక్కడా చెత్త, చెదారాలు లేకుండా చూడాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రెండు, ఐదు లీటర్ల వాటర్ బాటిల్స్‌ను మాత్రమే వినియోగించాలన్నారు. పంచాయతీ పరిధిలో స్వర్ణ పంచాయతీ నమోదు, గృహాల జియోట్యాగింగ్ వేగవంతం చేయాలన్నారు. కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు హెచ్చరించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెదబయలులో గల వర్తకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలం ఆ క్రమించి వ్యాపారాలు సాగించడం తగదన్నారు. ఆక్రమణలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. అలాగే, డిసెంబరు నెల ఒకటో తేదీనుంచి ప్లాస్టిక్ నిషేధిస్తున్నట్టు చెప్పారు. దీనిని వ్యాపారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణ, ఎంపీపీ వరహాలమ్మ,రాజుబాబు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

7న పేరెంట్స్ కమిటీ సమావేశాలు

పెదబయలు,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు పక్కాగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు. గురువారం స్థానిక గురుకుల పాఠశాలలో ఎంఈవోలు కృష్ణమూర్తి, పుష్పజోసెఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు నెల 7న అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో మెగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను, గ్రామస్తులను భాగస్వామంతో పాఠశాలల అభివృద్ధికి కార్యచరణ రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎన్నెన్నో వర్ణాలు!

వంజంగి హిల్స్‌లో ఆకట్టుకుంటున్న ప్రకృతి దృశ్యాలు



వంజంగి హిల్స్‌పై గురువారం ఉదయం ప్రకృతి దృశ్యాన్ని చూస్తున్న పర్యాటకులు

పాడేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శీతాకాలం కావడంతో మన్యంలోని ప్రకృతి అందాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వంజంగి హిల్స్‌పై మేఘాలు గురువారం తెల్లవారు జామున ఆకాశం నీలం, పసుపు వర్ణాల్లో దర్శనమిచ్చాయి. కేవలం వీకెండ్ పేరిట శని, ఆదివారాలు మాత్రమే పర్యాటకులు వంజంగి హిల్స్ సందర్శనకు విచ్చేవారు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా రోజూ సందర్శిస్తున్నాయి. దీంతో సందడి వాతావరణం నెలకొంటున్నది. హిల్స్‌లో సూర్యోదయ వేళ సుందర దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

వణుకుతున్న గిరిజన గ్రామాలు

హుకుంపేట: మండలంలోని రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. హుకుంపేట-పాడేరు, అరకు ప్రధాన రహదారిలో ఉదయం పది గంటల వరకు భారీ మంచు కురవటంతో వాహన చోదకులు లైట్లు వేసి ప్రయాణం సాగించాల్సి వస్తోంది. గిరిజనులు చలి మంటలు వేసుకుని ఎండ వచ్చే వరకు తమ పనులకు వేచి చూస్తున్నారు.

'రాగూర్ ఫార్మా'యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే
ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు

- బాధ్యులపై చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ


ఠాగూర్ ఫార్మా పరిశ్రమను సందర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఠాగూర్ ఫార్మా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆరోపించారు. గురువారం వీరు వేర్వేరుగా ఠాగూర్ ఫార్మా కంపెనీని సందర్శించారు. ప్రమాదానికిగల కారణాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఫార్మా పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువైందని, భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమలు, పీసీబీ, సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తున్నామన్నారు. వీరి వెంట టీడీపీ, జనసేన పార్టీల స్థానిక నాయకులు వున్నారు.

విద్యా శాఖలో సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే 'కొణతాల'ను కోరిన నోబెల్ టీచర్స్ ప్రతినిధులు


ఎమ్మెల్యే కొణతాలతో మాట్లాడుతున్న నోబెల్ టీచర్స్ ప్రతినిధులు

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నోబుల్ టీచర్స్ బృందం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరారు. ఈ మేరకు గురువారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విద్యాశాఖ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని వారు కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యాశాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై అనధికారికంగా బదిలీపై వెళ్ళిన సిబ్బందిని వెనక్కి పంపాలన్నారు. ఇటీవల జరిగిన రేషనలైజేషన్ సర్దుబాటు ప్రక్రియలో జరిగిన లోపాలను సరిదిద్దాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు తుమ్మపాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కా శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి'


శిబిరాన్ని సందర్శిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహనరావు

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు కోరారు. మండలంలోని గుల్లేపల్లి, బోదివలస గ్రామాల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని గురువారం సందర్శించి మాట్లాడారు. పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, చూడి నిలవకపోవడం, మగపశువులలో వృషణాల వాపులు, కీళ్ల వాపు వంటి లక్షణాలు కనిపిస్తే అది బ్రూసెల్లోసిస్ వ్యాధిగా గుర్తించాలని వివరించారు. అటువంటి పాడి రైతులు వెంటనే వైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ బి.సంధ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడమే 'సీడ్' లక్ష్యం


కశింకోట మండలం తేగాడలో కేజీబీవీ విద్యార్థినుల మానవహారం

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ (సీడ్) సంస్థ కృషి చేస్తోందని సంస్థ డైరెక్టర్ వి.సన్యాసిరాజు అన్నారు. భారత ప్రభుత్వ పిలుపునిచ్చిన 'బాల్య వివాహముక్త్ భారత్' కార్యక్రమం మేరకు సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు చోట్ల గురువారం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పలువురు అధికారులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, అనకాపల్లి సుంకరమెట్ట వద్ద ఉన్న సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో 23వ వార్డు దేవుడితోట వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకరంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సంస్థ ప్రతినిధులు కె.వి.చిన్నారావు, కనకమహాలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాము

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగలి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ జరిగిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రగతిలో ముఠా కార్మికులు అనేక సేవలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొందని, కానీ నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ముఠా కార్మికుల సమగ్ర చట్టం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, యూనియన్ ప్రతినిధులు మంద రాము, సురేష్, బోడి రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్..
తెగ అరుస్తున్నాయ్.. కరుస్తున్నాయ్..



అనకాపల్లి వాసులను భయపెడుతున్న వీధి కుక్కలు

- పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులుగా సంచారం
- వీటి బారినపడి ఎందరికో గాయాలు
- జీవీఎంసీ అధికారులు స్పందించాలని అంతా వేడుకోలు

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):

భౌ... భౌ....... ఈ శబ్దం వింటేనే జిల్లా కేంద్రం అనకాపల్లి ప్రజలు హడలిపోతున్నారు. ఎక్కడ చూసినా పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటి బారిన పడి ఎందరో ఇంజక్షన్లు చేయించుకునేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులున్న వారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండగా, ఆ స్థోమత లేనిసామాన్యులు ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.


లక్ష్మీనారాయణనగర్‌లో దుకాణం ముందు..

పట్టణంలో వీధి వీధిన బెడద

పట్టణంలోని ప్రతి వీధిలో కుక్కల బెడద నెలకొంది. పిల్లలు నుంచి వృద్ధుల వరకు వీటి బారిన పడి అవస్థలు పడుతున్నారు. గుంపులుగా తిరుగుతుండడంతో పలువురు భయాందోళన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా వెళ్లినవారిపై ఇవి తిరగబడుతున్నాయని చెపుతున్నారు. అలాగే, రాత్రివేళ వాహనదారులను వెంబడిస్తుండడంతో కొందరు వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

వైద్యాలయానికి నెలకు 250కు పైగా కుక్కకాటు బాధితులు

కుక్కకాటు బాధితుల సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది. అనకాపల్లిలోని ఒక్క ఎన్టీఆర్ వైద్యాలయానికే నెలకు 250 మందికి పైగా కుక్క కాటుకు గురైనవారు వచ్చి వైద్యం పొందుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా రింగురోడ్డు, భీమునిగుమ్మం, దాసరిగెడ్డ రోడ్డు, గాంధీనగరం, కోట్నివీధి తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. పగలు పెద్దగా భయభ్రాంతులకు గురిచేయకపోయినా, చీకటిపడితే ఇవి చెలరేగిపోతున్నాయని అంటున్నారు. మార్కెట్‌కు వచ్చే చుట్టు పక్కల గ్రామాల వారు సైతం వీటి బారినపడి ఆసుపత్రుల్లో వైద్యం పొందక తప్పడం లేదు. ఇటీవల అనకాపల్లి వచ్చిన జీవీఎంసీ కమిషనర్ కుక్కలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రజలు వాటి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. అయినా అధికారులు కుక్కలు పట్టుకుని ఇంజక్షన్లు చేయించి, తిరిగి ఎక్కడికక్కడే వదిలేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు

సోమవారం ఇక్కడ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కూడా జోనల్ కమిషనర్‌కు వీటి బారినుంచి కాపాడాలని అర్జీల అందాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారివెంట కుక్కలు పరుగులు తీస్తుండడం ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి వీటి బారినుంచి కాపాడాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై శానిటేషన్ సూపర్‌వైజర్ రవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, వారంలో మూడు రోజులు కుక్కలను పట్టి విశాఖకు తరలించి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. అలా చేయించిన వాటిని ఎక్కడ పట్టుకుంటే అక్కడే వదిలేయాల్సి వస్తుందన్నారు.

వైద్యాలయంలో కుక్క కాటుకు వైద్యం పొందిన వారి వివరాలు	
జూన్ నెల	290 మంది
జూలై నెల	239 మంది
ఆగస్టు నెల	254 మంది
సెప్టెంబరు నెల	209 మంది
అక్టోబరు నెల	268 మంది

నవంబరు నెలలో ఇప్పటి వరకు 211 మంది ఏఆర్‌వీ ఇంజక్షన్లు చేయించుకుని వైద్యం పొందారని ఎన్టీఆర్ వైద్యాలయం వైద్య సిబ్బంది తెలిపారు.


గాంధీనగరంలోని గుంపు

ఒకేరోజు ఓ కుక్క ఆరుగురికి కాటువేసింది



కుక్కల బెడద తగ్గించేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. జీవీఎంసీ పరిధిలో ఉన్న తమ స్వగ్రామమైన కొప్పాక నుంచి అనకాపల్లిలో కూరగాయల మార్కెట్‌కు పదిరోజుల క్రితం పువ్వుల కోసం వస్తే కుక్కకాటుకు గురయ్యాను. ఒకేరోజు ఆ కుక్క ఆరుగురిని గాయపరిచింది. మూడుసార్లు ఏఆర్‌వీ ఇంజక్షన్స్ చేయించుకోవాల్సి వచ్చింది.

ఎ.సంతోష్, కొప్పాక

పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు



వీధి కుక్కల వల్ల పట్టణంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమయాల్లో విద్యార్థులు చేతిలో బ్యాగ్ పట్టుకుని వెళ్తుంటే వారి వెంట పరుగులు పెడుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మహిళలు రాత్రి వేళల్లో బయటకు రావడానికి హడలిపోతున్నారు. ప్రతి వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించారు.

- పి.కుమార్‌రాజా, గవరపాలెం

సౌర విద్యుత్‌తో భావితరాలకు మేలు

- కొన్నేళ్లలో నిలిచిపోనున్న బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి
- కేంద్రం గుర్తించే సౌర, పవన విద్యుత్‌పై దృష్టి
- 'సూర్య ఘర్ యోజన'పై అవగాహన సదస్సులో కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : భావితరాల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఇంటికీ సౌర విద్యుదుత్పత్తి వ్యవస్థను అమర్చుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. మండలం లోని గుల్లేపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై గురు వారం ఏర్పాటైన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. రానున్న కొన్నేళ్లలో బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి నిలిచిపోనుందన్నారు. ఇప్పటికే ఇటు వంటి విద్యుదుత్పత్తి వలన పర్యావరణా నికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఇది గుర్తించే కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ ఇంధన ఉత్పత్తిపై దృష్టిసారించిం దన్నారు. ఇందులో భాగంగానే సౌర, పవన విద్యుదుత్పత్తిపై దృష్టసారిస్తున్నట్టు చెప్పారు. దేశంలో 135 సౌర విద్యుత్తు గ్రామాలను తీర్చిదిద్దాలని సంకల్పించిందన్నారు. అందులో గుల్లేపల్లిని ఒకటిగా ఎంపిక చేయడం విశేషమన్నారు. పూర్తి స్థాయి సౌర విద్యుత్ గ్రామంగా రూపాంతరం చెందితే గ్రామాభివృద్ధికి రూ.కోటి ప్రోత్సాహక బహుమతిని అందించనున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మాట్లా డుతూ గుల్లేపల్లి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అంతా ముం దుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పథకం విజయవంతమైతే గ్రామానికి నిధుల కొరత ఉండదన్నారు. టీడీపీ పెం దుర్తి నియోజవర్గ ఇన్‌చార్జి, ఏపీ కోఆప రేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్‌పర్సన్ గండి బాబ్జీ మాట్లాడుతూ కలెక్టర్ అవకాశం కల్పిస్తే తమ స్వగ్రామం మొగలిపురాన్ని పూర్తిస్థాయి సౌరవ్యవస్థ కలిగిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. గుల్లేపల్లిని ఆద ర్శంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. గ్రామంలో ఇప్పటి వరకు 507 ఇళ్ల యజమానులు ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నా రని ఏపీఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్. శిరీషారాణి, డీపీఆర్‌సీ అధికారిణి నాగలక్ష్మి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీ డీవో పద్మజ, ఎస్ఈ జి.ప్రసాద్, డీఈలు రామకృష్ణ, రాజశేఖర్, ఏడీఈ నిరీక్షణ్ అంబేద్కర్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, సర్పంచ్ బండారు మంగ, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను, ఏఈలు వీరేంద్ర, అశోక్, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్... వేదికపై పంచకర్ల రమేష్, గండి బాబ్జీ

సారా తయారీదారులకు బెల్లం సరఫరా వద్దు

- వర్తకుల సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్‌సింగ్

అనకాపల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయరాదని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సూర్జీత్‌సింగ్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి ఇక్కడి వర్తక సంఘం భవనంలో వర్తకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి వారంలో క్రయ విక్రయాలకు సంబంధించిన నివేదిక అందించాలన్నారు. ప్రతి వ్యాపారి లైసెన్స్ కలిగి ఉండాలని వివరించారు. ఏ వ్యాపారి ఒకేసారి నాలుగు వేల క్వింటాళ్ల బెల్లం కంటే అధికంగా నిల్వ ఉంచరాదన్నారు. వ్యాపారులు నాటు సారా తయారీకిగాని, తయారీదారులకు బెల్లం అమ్మకాలు చేయరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారి సుధీర్, సీఐ లక్ష్మణ్‌నాయుడు, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, వ్యాపారులు పాల్గొన్నారు.



వర్తకులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సూర్జీత్‌సింగ్

కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే కృషి : బుద్ద


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుద్ద నాగజగదీష్

తుమ్మపాల/కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పూలే విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అగుణంగా అంతా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్మోహన్, సిరసపల్లి సన్యాసిరావు, దాడి అప్పారావు, మళ్ల గణేష్, కర్రి మల్లేశ్వరరావు, విల్లూరి రమణబాబు, సాలాపు నాయుడు, దాడి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీల జిల్లా నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని గుండాల జంక్షన్ వద్ద గల ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా ఓ.మహేష్ (చోడవరం), కె.ధర్మారావు (పరవాడ), జనరల్ సెక్రటరీగా సీతామహాలక్ష్మి (మాకవరపాలెం), జాయింట్ సెక్రటరీగా జి.సత్యనారాయణ (ఎస్.రాయవరం), కోశాధికారిగా ఎం.వెంకటలక్ష్మి (కశింకోట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విస్తరణ అధికారుల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఈవోపీఆర్డీలు హాజరయ్యారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

తుమ్మపాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం మామిడిపాలెంలో కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 42వేల క్లెయిమ్‌లు పెండింగ్ ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను మళ్లించి పథకాలకు ఆ సొమ్మును వినియోగించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ క్లెయిమ్‌ల పరిష్కారం విషయంలో చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు

కొత్తూరు, నవబంరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ ఎ.విశ్వనాథ్ హాజరై విద్యార్థులకు పరీక్షలు చేశారు. అనుమానితులను గుర్తించి వారికి చికిత్స అందించారు. అనంతరం వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే దంత శుభ్రతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగాకు డిగ్రీ విద్యార్థిని



జయలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

సబ్బవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం బోటనీ విద్యార్థిని పండూరి జయలక్ష్మి యోగాలో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈనెల 24 నుంచి 28 వరకూ విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ జరిగిన అం తర కళాశాలల యోగా పోటీల్లో అద్భుతంగా రాణించడంతో జాతీయస్థాయికి ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ సీతాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లెక్కల గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఉపకార వేతనంపై నమూనా పరీక్ష

కశింకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనంపై వచ్చే నెల ఒకటో తేదీన నమూనా పరీక్ష నిర్వహించనున్నట్టు స్పందించే హృదయం సంస్థ నిర్వాహకులు ఆచంట నాగేశ్వరరావు, డి. నూకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కశింకోటలో ఉన్న డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మునగపాక జిల్లా పరిషత్ హైస్కూలులో ఉదయం ఎనిమిది గంటలకు ఒక బ్యాచ్, తొమ్మిది గంటలకు మరో బ్యాచ్‌కు ఈ పరీక్ష ఉంటుందని వివరించారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

కశింకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం, పరవాడపాలెం గ్రామాల్లో వృద్ధులు, వికలాంగులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై అందజేశారు. ఈ కార్యక్రమలో కూటమి నేతలు, గంటా యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, కాలువల నిర్మాణానికి కూటమి నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాలనీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం బెల్టుషాపునకు వేలం

- పేటసూదిపురంలో నిర్వహణ
- గ్రామంలో దండోర వేయించిన పెద్దలు
- రూ. రెండు లక్షలకు పాటను సొంతం చేసుకున్న గ్రామస్థుడు
- సమాచారం తెలుసుకొని వెళ్లిన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విభీషణరావు
- పాట నిర్వాహకులకు కౌన్సెలింగ్


పేటసూదిపురంలో బహిరంగంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపు వేలం పాటలో పాల్గొన్న జనాలు


పేటసూదిపురం పెద్దలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విభీషణరావు

ఎస్.రాయవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడైన బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. సాక్షాత్తు హోం మంత్రి వంగలపూడి అనిత ఇలాకాలో బెల్టుషాపుల కోసం గ్రామాల్లో దండోరా వేయించి బహిరంగంగా గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పేటసూదిపురం గ్రామంలో బుధవారం సాయంత్రం దండోర వేయించి గురువారం ఉదయం గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ నేతల ఆధ్వర్యంలో మద్యం బెల్టుషాపునకు బహిరంగంగా వేలం నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన పలువురు పాల్గొని బెల్టుషాపు దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. దేవుని పాట రూ. పది వేలతో మొదలైన ఈ పాట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.రెండు లక్షలకు బెల్టుషాపు సొంతం చేసుకున్నాడని ఆ గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. అయితే గ్రామంలో దండోరతోపాటు బెల్టుషాపు వేలం జరిగిన వీడియోలను పాట జరిగిన కొంత సమయంలోనే మద్యం అక్రమ విక్రయాలు నచ్చని కొందరు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ విభీషణరావు గురువారం సాయంత్రం ఆ గ్రామానికి వెళ్లారు ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బెల్టుషాపు వేలానికి కారకులైన ఇరు పార్టీల పెద్దలు, పాటను సొంతం చేసుకున్న వ్యక్తితోపాటు వేలం పాటకు సహకరించిన పలువురిని పిలిపించి హెచ్చరించడంతోపాటు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే వేలం నిర్వహిస్తుండగా మధ్యలో స్థానికులు వాగ్వాదం చేయడంతో పాట నిలిపివేశామని గ్రామ పెద్దలు చెప్పారన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఎవరూ కూడా అక్రమంగా మద్యం విక్రయించకూడదని గ్రామ పెద్దలు తీర్మానం చేశారన్నారు. వేలం పాటకు కారకులైన పెద్దలతోపాటు పాటలో పాల్గొన్న ఎనిమిది మందిని బైండోవర్ చేయడం జరుగుతుందని సీఐ శ్రీనివాసరావు చెప్పారు. ఇదిలావుంటే బెల్టుషాపునకు వేలం నిర్వహించిన నిర్వాహకులతోపాటు పాల్గొన్న వారిపై చర్యలు చేపట్టకుండా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు కౌన్సెలింగ్‌తో సరిపెట్టడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన ప్రసాద్ (ఫైల్)

నర్సీపట్నం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురందొరపాలెం గ్రామ శివారులో ఒక వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. లోతుగెడ్డ జంక్షన్‌కు చెందిన ప్రసాద్ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మిర్చి వ్యాపారస్తుడు వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడన్నారు. అనకాపల్లిలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడన్నారు. ప్రసాద్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని సీఐ రేవతమ్మ తెలిపారు. దీంతో ప్రసాద్ బుధవారం రాత్రి అత్తగారి గ్రామమైన గురందొపాలెంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పవర్ హౌస్

- మీ ఇల్లే ఓ విద్యుదుత్పత్తి కేంద్రం
- కేంద్ర ప్రభుత్వ రాయితీతో సౌర విద్యుత్ సులభతరం
- ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం
- గృహ వినియోగదారులకు మాత్రమే వర్తింపు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)
సహజ వనరులను రక్షించుకునేందుకు, ప్రకృతిని సంరక్షించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో నీరు, బొగ్గు ఆధారిత విద్యుత్‌కు బదులుగా సౌర విద్యుత్ వెలుగులు గ్రామాల్లో నింపాలనే ఉద్దేశం ఒకటి. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు తీసుకువచ్చిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ వినియోగదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించనుంది. ఈ పథకంలో నమోదై ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవడం ద్వారా వినియోగదారుడు తమకు కావాల్సిన కరెంట్‌ను వాడుకుని మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించవచ్చు. వినియోగదారుడే ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం ఈ పథకం ద్వారా మారే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పథకాన్ని గృహోపయోగానికి వర్తింపజేస్తున్నారు. పథకం కింద లబ్ధి పొంది నెలవారీ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చు.



ఒక కిలో వాట్ సామర్థ్యంగల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుదుత్పత్తి అవుతుంది. వినియోగదారుడికి ప్రస్తుత వస్తున్న బిల్లు రూ.1000 అయితే సోలార్ ఏర్పాటు తర్వాత వచ్చే బిల్లు 338 మాత్రమే. ఏడాదికి రూ.8వేలు ఆదా అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చ.మీ లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కేవీపీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకోవచ్చు. రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకు 240 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. దీనిద్వారా నెలకు రూ.2 వేల విద్యుత్ బిల్లు వచ్చే వినియోగదారుడికి రూ.333 మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది. ఏడాదికి రూ.20 వేలు ఆదా అవుతుంది. ఇక మూడు కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుంటే నెలకి 360 యూనిట్లు ఉత్పత్తి జరుగుతుంది. రూ.3వేల వరకు వచ్చే బిల్లు రూ.293కు తగ్గనుంది. దీని ద్వారా ఏడాదికి రూ.32,400 ఆదా. ఈ పథకంలో లబ్ధిదారుడికి కేంద్రం నుంచి ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లు, అంతకు మించినా రూ.78వేల వరకు రాయితీ లభిస్తుంది.

నమోదు చేసుకోవడమిలా..

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకునేందుకు యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో వెండర్ల (కాంటాక్టర్లు) వివరాలుంటాయి. పేరు నమోదు చేసుకున్న తరువాత తమకు నచ్చిన వారిని ఎంచుకోవచ్చు. తమ ఇంటికి ఎన్ని కిలో వాట్ల విద్యుత్ అవసరమో ఎంచుకుని నమోదు చేసుకోవాలి. ఒకటి, రెండు, మూడు కిలోవాట్ల వరకు వర్తింపజేస్తారు.

మిగులు విద్యుత్‌కు నగదు చెల్లింపు

ఇళ్లపై బిగించిన సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా విద్యుదుత్పత్తి అవుతుంది. అక్కడి నుంచి తిరిగి ఇళ్ల సర్వీస్ తీగల నుంచి ఇంటి అవసరాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. విద్యుత్ సరఫరా, వినియోగం ఎంతమేర అనేది సోలార్ యూనిట్ ద్వారా అమర్చిన ప్రత్యేక మీటర్‌లో నమోదవుతుంది. సౌర ఫలకల ద్వారా ఒక ఇంటి నుంచి ఎంతమేర విద్యుదుత్పత్తి అయింది, ఎంత వినియోగించారు, మిగులు విద్యుత్ ఎంత అనే లెక్కలు మీటర్‌లో నమోదవుతాయి. వినియోగదారుడు సౌరవిద్యుత్ ఉత్పత్తి కంటే అధికంగా వినియోగిస్తే అందుకు తగ్గ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. మిగులు ఉంటే విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలకు ఒకసారి లెక్కించి యూనిట్‌కు ప్రస్తుత మార్కెట్ ధర రూ.2.90 చొప్పున చెల్లిస్తారు.

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు



ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారుడు విద్యుదుత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుంది. అధిక ప్రయోజనాలు కలిగిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవాలి. దీనిపై వినియోగదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు వీలుగా ఇటీవల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం. అక్కడ వెండర్లతో స్టాళ్లు ఏర్పాటు చేసి, సౌర విద్యుత్ వినియోగంతో కలిగే లాభాలను వివరించాం. - పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీ ఈపీడీసీఎల్

సీలేరులో సినిమా షూటింగ్ సందడి

సీలేరు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ ఆలయం వద్ద గురువారం రాత్రి సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఏవైకా హోమ్స్ ప్రైవేటు లిమిటెడ్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'మదం'లో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఈ సినిమా డైరెక్టర్ మల్ల వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ సినిమా ఎమోషనల్ రివెంజ్ డ్రామా అని తెలిపారు. ఈ చిత్రంలో కొత్త కథానాయకుడు, కథానాయికలు హర్ష, గంగవరపు అనురూప్, కటారి లత, విశ్వనాథ్ రెడ్డి నటిస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రమంతా సీలేరు బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కిస్తున్నామన్నారు. గురువారం రాత్రి మారెమ్మ ఆలయంలో జాతర జరిగే సెట్ వేసి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో కెమెరామెన్ రవి కుమార్, ఎడిటర్ నందమూరి తారకరామారావు, సీఈఓ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.


సీలేరు మారెమ్మ ఆలయం వద్ద సినిమా షూటింగ్ కోసం ముస్తాబు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- అధికారులకు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశం

అనకాపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రజలలో అవగాహన కల్పించడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఆర్అండ్‌బీ, రవాణా శాఖ, పంచాయతీరాజ్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, స్థానిక ఎస్‌హెచ్‌ఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో తనిఖీలు చేసి ప్రమాదాల నివారణకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. రోడ్డు ఇంజినీరింగ్, లైటింగ్, రోడ్డు భద్రతకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, కేట్ ఐ, అక్రమ మీడియన్‌లను మూసివేయించాలన్నారు. వాహనచోదకులు నియమ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉల్లంఘన దారులపై కేసులు నమోదు చేయాలన్నారు. వాహనదారులు, చోదకులు, పాదచారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు శ్రావణి, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో అప్పారావు


విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావు

చోడవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డిఈవో జి. అప్పా రావు సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని కొత్తూరు జెడ్పీ బాలికల హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి సిలబస్, పరీక్షలకు సన్నద్ధత గురించి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అందరూ చక్కని మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. భోజనం నాణ్యత బాగుండాలని, విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని వడ్డించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం, ఎంఈవో కార్యాలయాలను పరిశీలించారు. కొత్తగా మంజూరైన హాస్టల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, తిరుపతిరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరండోల్ రైలుకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నం-కిరండోల్ రైలు (08551)కు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వాల్తేరు డివిజన్ అధికారులు ఒక స్లీపర్ కోచ్, థర్డ్ ఏసీ కోచ్ ఒకటి అదనంగా ఏర్పాటుచేశారు. స్లీపర్ కోచ్ డిసెంబరు 1 నుంచి 31 వరకూ, అటు నుంచి వచ్చే రైలు (08552)కు డిసెంబరు 2 నుంచి జనవరి 1 వరకు అందుబాటులో ఉంటుంది. ఇక థర్డ్ ఏసీ కోచ్‌ను ఇటు నుంచి డిసెంబరు 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, జనవరి 1 తేదీల్లో, అటు నుంచి వచ్చే రైలుకు డిసెంబరు 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, జనవరి 2వ తేదీల్లో జత చేస్తారు.

రైళ్ల మళ్లింపు

భద్రతాపరమైన పనులు జరుగుతున్నందున గుంతకల్ డివిజన్‌లో రైళ్లను నంద్యాల-ఎర్రగుంట్ల-గూటీ-అనంతపురం మీదుగా నడుపుతారు. సాధారణంగా ఈ మార్గంలో రైళ్లు నంద్యాల-డోన్ మీదుగా అనంతపురం వెళతాయి. ఇప్పుడు డోన్‌కు రైళ్లు వెళ్లవు. పూరీ-యశ్వంత్‌పూర్ రైలు (22883) వచ్చే నెల 6న మళ్లింపు మార్గంలో వెళుతుంది. యశ్వంత్‌పూర్-పూరీ (22884) డిసెంబరు 7న మళ్లింపు మార్గంలో నడుపుతారు. హౌరా-యశ్వంత్‌పూర్ (22831) డిసెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్-హౌరా (22832) రైలు డిసెంబరు 6 నుంచి 13వ తేదీ వరకూ మళ్లింపు మార్గంలో నడుపుతారు.

బెల్టుషాపు కేసులకు రాజీ మార్గం

- మూడు రెట్లు జరిమానా కడితే కేసు నుంచి వెసులుబాటు
- లోక్ అదాలత్‌లో 61 కేసులు రాజీకి ప్రతిపాదనలు

నర్సీపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన మద్యం బెల్టు షాపు కేసులకు ఎక్సైజ్ అధికారులు రాజీ ప్రతిపాదనలు పెట్టారు. గత ప్రభుత్వం మద్యం దుకాణాలు స్వయంగా నిర్వహించిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో కొనుగోలు చేసి బెల్టు షాపుల్లో అధిక ధరలకు విక్రయించేవారు. 2024 సంవత్సరంలో ఇక్కడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సుమారు 100 కేసులు నమోదయ్యాయి. కోర్టులో కేసులు నడుస్తున్నాయి. నేరం నిరూపణ అయితే నిందితులకు 8 ఏళ్ల జైలు శిక్ష పడుతుందని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. డిసెంబరులో జరిగే లోక్ అదాలత్‌లో బెల్టు షాపుల మీద పెట్టిన కేసులు రాజీ చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. బుధవారం నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్‌లో 61 మంది అక్రమ బెల్టు షాపు నిర్వహకులు రాజీకి ముందుకు వచ్చారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 186 లీటర్ల లిక్కర్ విలువకు మూడు రెట్లు అపరాధ రుసుం చెల్లించి లోక్‌అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. 186 లీటర్ల మద్యం విలువ రూ.1.41 లక్షలు కాగా, నిందితులు మూడు రెట్లు రూ.4.25 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

కాగా 8 ఏళ్ల జైలు శిక్ష పడే కేసులను రాజీ చేస్తే, తర్వాత కూడా అదేవిధమైన నేరం చేస్తారని, ఇటువంటి కేసులను రాజీ చేయడానికి ఎక్సైజ్ అధికారులు ఎలా ప్రయత్నం చేస్తారని సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

రెసిడెన్షియల్ పద్ధతిలో టీచర్ల శిక్షణను రద్దు చేయాలి : యూటీఎఫ్

అనకాపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెసిడెన్షియల్ విధానంలో ప్రధానోపాధ్యాయులకు,ఉపాధ్యాయులకు వేరే జిల్లాలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం కొప్పాకలో గల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ట్రైనింగ్ కార్యక్రమాలు జిల్లా ఉపాధ్యాయులను విజయనగరంలో రెసిడెన్షియల్ పద్ధతిలో సంవత్సరం పొడవునా శిక్షణలు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి నెల బ్యాచ్‌ల వారీగా ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు శిక్షణ ఇస్తూ రాత్రి బస కూడా అదే జిల్లాలో ఉండాలని కోరుతూ తమపై తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నదన్నారు. ఉపాధ్యాయుల ప్రాణాలను బలిగొంటున్న ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలంటూ అనేక మార్లు కోరినప్పటికీ మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. గురువారం మరో ప్రధానోపాధ్యాయుడు విజయనగరం జిల్లా శిక్షణ తరగతులలో ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందన్నారు. ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. ఇలాంటి శిక్షణలను సెలవుల్లో లేదా ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ప్రాణాలను హరించే ఇలాంటి శిక్షణలను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రొంగల అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు మాకిరెడ్డి రాజనాయుడు, వి. రమేష్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం. వెంకటప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులు షేక్ సలీం, సీనియర్ నాయకులు మామిడి బాబురావు, దేవుడునాయుడు, రవి, భాష, తేజవర్ధన్, ఆశ, నూతన్, నారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లిలో క్వారీల నిర్వహణపై విజి'లెన్స్'

కొత్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని అక్రమ క్వారీలు, తవ్వకాలు, క్రషర్ల నిర్వహణపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం, గనుల శాఖ విజిలెన్స్ విభాగం ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగా గురువారం కుంచంగి, మార్టూరు, మామిడిపాలెం, బవులవాడ తదితర గ్రామాల్లో ఉన్న క్వారీలను ఆయా బృందాలు పరిశీలించాయి. వేటజంగాలపాలెం సర్వే నెంబరు 84లో అనధికారికంగా గత ఐదేళ్లుగా తవ్వకాలు జరుగుతున్న క్వారీలను డీఎస్పీ స్థాయి అధికారుల బృందం పరిశీలించినట్టు సమాచారం. భోగాపురం, కాకినాడ పోర్టు, తుని, రాంబిల్లి తదితర ప్రాంతాలకు వెళ్లినా అక్కడ అనకాపల్లి ప్రాంతం నుంచి భారీ వాహనాలతో తరలి వస్తున్న రాయి, పిక్క దర్శనం ఇస్తున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా అనకాపల్లి ప్రాంతం నుంచి ప్రభుత్వానికి ఆదాయం రాకపోవడంతో అధికారులు ప్రత్యేక చర్యలు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. జీపీఎస్ విధానం అమలులో ఉన్నా గనులశాఖ అనకాపల్లి కార్యాలయంలో పనిచేసిన కొందరు సిబ్బంది సహకారంతో ఇదంతా నడుస్తున్నట్టు గుర్తించారని సమాచారం. ఒక్క వేటజంగాలపాలెం పంచాయతీ పరిధిలోనే 18 క్వారీలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాగా గురువారం మధ్యాహ్నం ఆ బృందాలు వెళ్లే సమయానికి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిగినట్లు తెలిసింది. అయితే దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రైల్వే ఫ్లై ఓవర్ వంతెనలు ఛిద్రం

... 5వ పేజీ తరువాయి

ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. డివైడర్, ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు విరిగిపోయాయి. సిమెంట్ రెయిలింగ్ కొన్నిచోట్ల పడిపోయింది.క ఫుట్‌పాత్‌పై పలకలు విరిగిపోవడవంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వంతెన దుస్థితి గురించి ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిధులు లేవంటూ సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా లంకెలపాలెం రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్వహణ గురించి ఆర్అండ్‌బీ ఏఈ బాలరాజును వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ప్రాణాలు తీస్తున్న ఫార్మా కంపెనీలు

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడం లేదు. ఈ ఏడాది ఆగస్టు 21న ఎసెన్షియాలో ప్రమాదం జరగ్గా, ఆ మరుసటిరోజే సినర్జీస్‌లో ప్రమాదం చోటుచేసుకుని మరో నలుగురు చనిపోయారు. ఆ తరువాత రాంకీ ఫార్మాసిటీలో కూడా ప్రమాదం జరిగితే గుట్టుగా ఉంచి రెండు రోజుల వరకూ బయటకు తెలియనివ్వలేదు. తాజాగా ఠాగూర్ కంపెనీలో ప్రమాదకరమైన హైడ్రోక్లోరిక్ వాయువు లీకై గురువారం నాటికి ఇద్దరు మరణించారు. వాస్తవానికి లీకైంది క్లోరిన్ వాయువని ఆ రంగానికి చెందినవారు చెబుతున్నారు. గత నెలలోనే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు ఆ కంపెనీకి తనిఖీకి వెళ్లారు. ఎటువంటి సూచనలు చేశారో బయటపెట్టడం లేదు. అన్నీ సరిగ్గా ఉంటే ప్రమాదం ఎలా జరిగిందనేది అనుమానంగా ఉంది. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు ఓ ప్రహసనంలా సాగుతున్నాయి. వారి అవినీతికి హద్దులు లేవు. సెంట్రల్ పోర్టల్ ద్వారా ఏ తేదీన ఏ అధికారి ఏ కంపెనీకి తనిఖీకి వెళ్లాలనేది సూచిస్తున్నారు. ఒక్కొక్కరిని ఒకేరోజు నాలుగైదు కంపెనీలకు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తున్నారు. దీనివల్ల తనిఖీలు సరిగ్గా జరగడం లేదు. రాష్ట్రంలో అత్యధిక ఫార్మా కంపెనీలు ఉన్నది ఇక్కడే. అధికారులకు అధిక ఆదాయం ఇచ్చే జిల్లా కూడా ఇదే. దాంతో ఆ శాఖలోని పెద్దలు వారికి అనుకూలంగా ఉండేవారిని ఇక్కడ పెట్టుకొని తూతూమంత్రపు తనిఖీలతో జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విచిత్రంగా ఎల్‌జీ పాలిమర్స్ నుంచి ఠాగూర్ కంపెనీ వరకు పెద్ద ప్రమాదాలు జరిగిన కంపెనీలన్నీ కొద్దిమంది అధికారులు తనిఖీ చేసినవే కావడం గమనార్హం. వారికి తనిఖీ చేసే సామర్థ్యం లేదా?, జేబులు నింపుకొని మిన్నకుంటున్నారా?...అనేది ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ఇటీవల ఒక అధికారిని దుష్ప్రవర్తన కారణంగా సస్పెండ్ చేశారు. ఇప్పుడు మూడు జిల్లాలకు కలిపి పరిశ్రమలను తనిఖీ చేసేందుకు ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. అన్నీ తమ చేతుల్లోనే ఉండాలని ఇలా చేస్తున్నారా?...అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

సూచనలు బేఖాతరు

ఎసెన్షియా ప్రమాదం తరువాత విజయవాడ నుంచి పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు వచ్చారు. అధికారులు, కార్మికులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. వాటిని అమలు చేయాల్సిందిగా సూచించారు. అలాగే గుర్తించిన లోపాలు కూడా వెల్లడించారు.

సేఫ్టీ ఆడిట్ ఏమైంది..?

ఎసెన్షియా ప్రమాదం తరువాత వారం రోజుల్లో ప్రతి కంపెనీ కూడా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలని విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. ఇదంతా ఆ ఒక్కరోజు హడావుడిగానే మిగిలిపోయింది. ఎవరు ఆడిట్ చేశారు?, ఎవరు చేయలేదు?, కారణాలు ఏమిటి?...అనేది సమీక్షించలేదు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589